నినాదం

https://hcusahityalahari.blogspot.com

# సాహిత్య లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,

ఆదివారం 9-08-2026


**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com

Whatsapp No:6305584064

## గతం గతః



ఓ కొత్త కథకు మూల ప్రేరణ
ఒక వైవిధ్య జీవనానుకరణ
నిరంతర సాధన దిశలోనే
అనుభవ పరంపరకు దారి

తవ్విన కొలదీ వ్యర్థాలన్ని
బయటపడిన మాదిరిగానే
త్రుప్పు పట్టిన సామానులు
తునాతునకలైన తీరుగానే

పాతర వేసిన వస్తువులన్ని
మట్టి పొరలలో దాగినట్లు
చిలుమెక్కిన దినుసులన్ని
ఇసుకపాతరలో దాచినట్లు

ఇవన్నియు పాతవే కావచ్చు
ఒక తరంతరపు గురుతులు
నిడివి తక్కువ రకం కావచ్చు
వాటికున్న విలువ అమూల్యం

గతం తాలూకు తలపులు
అవి జ్ఞాన సాక్షాత్కారాలు
పరీక్షలో నెగ్గిన సచ్ఛీలతలు
శిథిలం కాని రాజమార్గాలు

గతం అంతర్ముఖ దర్శనం
భరించే బాధలే నిదర్శనం
శూన్యంలో పయనిస్తున్నా
తరలివచ్చి పలకరిస్తుంది

ఎల్లకాలం వల్లకానివి
జ్ఞాపకాలు కల్ల కానివి
అవి అనంతమైనవే గానీ
వాటికి అంతమనేది లేదు

కనపర్తి రాజశేఖరమ్
7382847673

# తెలుగు సాహిత్యంలో ఏకపాత్రాభినయ సాహిత్యం

***సాహిత్య ప్రక్రియలు కాలక్షేపం కోసం పుట్టవు. కాలం ముందుంచిన ప్రశ్నలకు కళాత్మక సమాధానంగా రూపుదిద్దుకుంటాయి. ఏకపాత్రాభినయ సాహిత్యం కూడా అలాంటి సృజనాత్మక అవసరం నుంచే ఆవిర్భవించిన ప్రక్రియ. ఒక వ్యక్తి అంతరంగంలో జరిగే సంఘర్షణను, అతని ఆలోచనలను, జీవితానుభవాన్ని, సమాజంతో అతనికి ఉన్న సంబంధాన్ని అనేక పాత్రల ద్వారా కాకుండా ఒకే పాత్ర ద్వారా మరింత గాఢంగా ఆవిష్కరించవచ్చని రచయితలు గుర్తించారు. అనేక సందర్భాలు, భావోద్వేగాలు, జీవిత అనుభవాలను సజీవంగా తీసుకురావడం ఈ సాహిత్య ప్రక్రియ విశిష్టత. ఏకపాత్రాభినయ సాహిత్య అవసరం కేవలం ఆర్థిక పరిమితుల వల్ల ఏర్పడలేదు. వ్యక్తి అంతర్మథనం, ఒంటరితనం, సామాజిక అన్యాయంపై ఆవేదన వంటి భావాలను ఒకే పాత్ర ద్వారా మరింత ప్రభావవంతంగా వ్యక్తీకరించే అవకాశాన్ని ఈ సాహిత్యం కల్పించింది. ఒక పాత్ర తనతో తానే మాట్లాడుతున్నట్లు కనిపించినా, వాస్తవానికి అది సమాజంతో చేసే సంభాషణ. తన అనుభవంలో సమాజపు వేదనను, తన ప్రశ్నల్లో ప్రజల ఆలోచనలను ప్రతిబింబిస్తుంది.***

**అంతర్ముఖ కళారూపం – ఊహాశక్తి వైభవము:**


ఏకపాత్రాభినయ సాహిత్యం ఒక అంతర్ముఖ సాహిత్య రూపం. సాధారణ కథనాల్లో బాహ్య సంఘటనలు, పాత్రల పరస్పర సంబంధాలు ప్రధానంగా ఉంటాయి. కానీ ఇందులో ఒక వ్యక్తి మనసులో జరిగే ఆలోచనల ప్రవాహం, జ్ఞాపకాలు, సంఘర్షణలు, భావోద్వేగాలే ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. బయట ప్రపంచంతో పాటు తనలోని ప్రపంచాన్ని కూడా ఆవిష్కరించే అవకాశం ఈ ప్రక్రియలో ఉంటుంది. అందువల్ల మానవ మనస్తత్వంలోని లోతులను పరిశీలించడానికి, వ్యక్తి అంతరంగాన్ని కళాత్మకంగా ప్రతిబింబించడానికి ఇది ఒక శక్తివంతమైన అభివ్యక్తి రూపంగా నిలుస్తుంది. ఒకే పాత్ర ద్వారా భావప్రవాహాన్ని ముందుకు నడిపించడం, కనిపించని వ్యక్తులు, సంఘటనలను ఊహల్లో సజీవంగా నిలబెట్టడం ఒక అసాధారణ సాహిత్య కళ. ఏకపాత్రాభినయ సాహిత్యంలో పాఠకుడి ఊహాశక్తికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ప్రత్యక్షంగా కనిపించని అనుభవాలు, గత సంఘటనలు, ఇతర వ్యక్తుల ఉనికి అన్నీ పాత్ర మాటలు, భావవ్యక్తీకరణ ద్వారా ఊహలో రూపుదిద్దుకుంటాయి. ప్రతి సంభాషణ ఒక దృశ్యాన్ని, ప్రతి భావం ఒక అనుభూతిని సృష్టిస్తుంది. ఈ విధంగా ఈ సాహిత్యం రచయిత సృజనాత్మకతతో పాటు స్వీకరించే వ్యక్తి ఊహాశక్తిని కూడా భాగస్వామ్యం చేసే రూపంగా నిలుస్తుంది.

**సామాజిక చైతన్యం – నిర్మాణ స్వేచ్ఛ:**

తెలుగు సాహిత్యంలో ఏకపాత్రాభినయ సాహిత్యం ఒక ప్రత్యేక అభివ్యక్తి రూపంగా ఎదగడానికి రచయితల సృజనాత్మక ప్రయోగాలే కారణం. సామాజిక అసమానతలు, అవినీతి, నిరుద్యోగం, స్త్రీ జీవితం, కుటుంబ విలువలు, రాజకీయ వ్యంగ్యం, మానవ సంబంధాల సంక్లిష్టత వంటి అనేక అంశాలు ఈ సాహిత్య రచనల ద్వారా ప్రాణం పోసుకున్నాయి. ఒకే పాత్ర ద్వారా సమాజంలోని విభిన్న కోణాలను చూపించే సామర్థ్యం దీనికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. తెలుగు రచయితలు ఈ సాహిత్యాన్ని స్వీకరించడానికి ప్రధాన కారణం దాని నిర్మాణ స్వేచ్ఛ. అనేక పాత్రలు, అనేక సంఘటనలు లేకుండానే ఒక వ్యక్తి జీవితాన్ని సంపూర్ణంగా చిత్రించే అవకాశం ఇందులో ఉంది. వ్యక్తిగత అనుభవాన్ని సామాజిక అనుభవంగా మలచగల శక్తి దీనికి ప్రత్యేకతను ఇచ్చింది.

**పరిణామ క్రమం – కాలానుగుణ మార్పులు:**

కాలానుగుణంగా ఈ సాహిత్యం తన రూపాన్ని మార్చుకుంటూ వచ్చింది. ఒకప్పుడు పురాణ, చారిత్రక వ్యక్తుల జీవితాలను ఆధారంగా చేసుకున్న ఈ రచనలు, తరువాత సామాజిక సమస్యలు, సాధారణ మనిషి జీవితం, సమకాలీన సంఘర్షణలను ప్రతిబింబించే అభివ్యక్తి మార్గంగా ఎదిగాయి. వ్యక్తిగత వేదన నుంచి సామాజిక ప్రశ్నల వరకు అనేక అంశాలను ఒకే పాత్ర ద్వారా వ్యక్తీకరించే సామర్థ్యం కారణంగా ఆధునిక కాలంలో కూడా ఈ సాహిత్యం తన ప్రాధాన్యాన్ని కొనసాగిస్తోంది.





**రచనా శిల్పం – సృజనాత్మక సవాళ్లు:**

సాహిత్యపరంగా చూస్తే ఏకపాత్రాభినయ సాహిత్యం ఒక కఠినమైన రచనా ప్రక్రియ. ఇందులో పాత్రే కథకుడు, పాత్రే సాక్షి, పాత్రే వ్యాఖ్యాత. కథను ముందుకు నడిపేది సంఘటనలు మాత్రమే కాదు. పాత్ర ఆలోచనలు, అనుభూతులు, అంతర్మథనాలే. అందువల్ల రచయిత పాత్ర మనస్తత్వాన్ని సహజంగా నిర్మించాలి. ప్రతి సంభాషణ పాత్ర స్వభావాన్ని వెల్లడించాలి. ప్రతి మౌనం ఒక భావాన్ని వ్యక్తం చేయాలి. ప్రతి విరామం ఒక అంతర్గత సంఘర్షణను అనుభూతి చేయించాలి. ఇటువంటి రచనలలో రచయితకు ప్రత్యేకమైన సవాళ్లు ఎదురవుతాయి. అనేక పాత్రలు, సంఘటనలు, సంభాషణల ఆధారం లేకుండా ఒకే పాత్ర చుట్టూ మొత్తం భావప్రపంచాన్ని నిర్మించాలి. ఆ పాత్ర వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, భావోద్వేగాలు, జీవన నేపథ్యం సహజంగా ప్రతిబింబించేలా రచన సాగాలి. పాత్ర మాటల్లోనే కథనం, సంఘర్షణ, సామాజిక సందేశం వ్యక్తమయ్యేలా చూడటం రచయితకు పెద్ద సవాలు. ఒకే పాత్ర ద్వారా ఆసక్తిని కొనసాగించడం కూడా కీలకమైన అంశం. పాత్రలోని మార్పులు, అంతర్మథనాలు, జ్ఞాపకాలు, ప్రశ్నలు సహజమైన క్రమంలో సాగాలి. ప్రతి సంభాషణకు అర్థం ఉండాలి. అవసరం లేని వివరణలు లేకుండా, తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని వ్యక్తీకరించే సామర్థ్యం రచయితకు అవసరం. పాత్ర వ్యక్తిగత అనుభవాన్ని సామాజిక అనుభవంగా మలచగలిగినప్పుడే ఈ రచన ప్రభావవంతంగా మారుతుంది.

అలాగే పాత్ర స్వరం, భాష, ఆలోచనా స్థాయి, జీవన పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా రచయిత జాగ్రత్త వహించాలి. కేవలం భావోద్వేగాలను వ్యక్తం చేయడం కాకుండా, ఆ పాత్ర ద్వారా కాలం, సమాజం, మానవ సంబంధాలపై ఒక స్పష్టమైన దృక్పథాన్ని అందించాలి. అందువల్ల ఏకపాత్రాభినయ సాహిత్యం అనేది ఒక పాత్రను సృష్టించడం మాత్రమే కాదు. ఆ పాత్రలో ఒక జీవితాన్ని, ఒక కాలాన్ని, ఒక సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబించే సృజనాత్మక బాధ్యత. తెలుగు సాహిత్యంలో ఇది ఒక ఉపప్రక్రియగా పరిమితం కాలేదు. వ్యక్తి అంతరంగాన్ని కళాత్మకంగా ఆవిష్కరించిన ప్రత్యేక అభివ్యక్తి రూపంగా నిలిచింది. ఒకే పాత్ర ద్వారా జీవిత అనుభవాలను, భావాలను, సామాజిక వాస్తవాలను పలికించే ఈ ప్రక్రియ రచయితకు సృజనాత్మకతను, పాఠకుడికి ఆలోచనను అందించింది. ఒకే పాత్ర స్వరంలో ఒక సమాజం మాట్లాడుతుంది. అందుకే ఏకపాత్రాభినయ సాహిత్యం తెలుగు సాహిత్య సృజనాత్మకతకు చిరస్థాయిగా నిలిచిన రూపంగా భావించవచ్చు.

విర్గో : 8247045230

## కాలుతున్న నగరం






ఇప్పుడు ఒకరి కళ్ళలోకి
ఒకరు చూసుకోవడం లేదు.
అమ్మకంటే,
అన్నంకంటే,
ఫోన్ వేడెక్కి పోతోంది.
ఇంట్లో మాటలన్నీ
ఆఫ్ లైన్ అయి పోయాయి.
ఏది ఏమి మోసు
కెళుతోందో
తెలియటం లేదు.
జ్ఞాపకాలనా!
కలలనా!
లేక రేపటి భయాన్నా!
అసలు నీలో ప్రవహిస్తున్నది
ఒడ్డులు లేని నదా?
మాటలన్నీ అయిపోయాక
మిగిలేది నిశ్శబ్దం కాదు.
విరిగిన శబ్దం.
దానిముక్కలు గుండెల్లో
గుచ్చుకొంటాయి.
రక్తంరాదుగాని,
నొప్పిఉంటుంది.
కానీ,
నాలోంచి నవ్వు చనిపోయింది.
కలలు చనిపోయాయి.
ఆశ చనిపోయింది.
బయటకు గాయాలు కనిపించడం లేదుగాని,
లోపలమాత్రం
రక్తం గడ్డకట్టుకుపోయింది.
అందుకే!
నా నీడ
నా పేరు మర్చిపోయింది.
నాలో ఒక నగరం
ఎప్పుడూ కాలుతోనే వుంటుంది.
ఏ చెట్టు పుట్టా
నాతో మాట్లాడటం లేదు.
చచ్చిపోయిన సంబంధాలకు
మనసుకు పోస్ట్ మార్టం చేసి రోజూ
ఆకాశాన్ని జేబులో పెట్టు కొని తిరుగుతుంటాను

ఏటూరి నాగేంద్రరావు
7416665323



# అమ్మానాన్నల ప్రేమను చూడలేని నా బాల్యం



ఆటపాటల వయసులో
అంతులేని శూన్యం
అమ్మానాన్నల ప్రేమను
చూడలేని నా బాల్యం.

పసిప్రాయపు గుండెల్లో
తరిగిపోని గాయం
నన్ను ఒంటరిని చేసి వెళ్ళిపోయింది
కన్నవారి సాయం.

వేరే పిల్లలు వాళ్ళ
అమ్మ ఒడిలో చేరుతుంటే
నా కళ్ళు నా కన్నతల్లి
కోసం వెతికాయి.

నాన్న భుజాలెక్కి
లోకాన్ని చూసే వయసులో
నా కన్నీళ్లు నేల రాలి
ప్రశ్నలుగా మిగిలాయి.

అమ్మ ప్రేమ ఎలా
ఉంటుందో చూడలేదు నేను
ఆ వెచ్చని ఒడిలో తలవాల్చి
పడుకోలేదు నేను.

నాన్న అనే పిలుపుకు
దూరం అయ్యాను నేను,
ఆ ధైర్యపు నీడలో
ఒక్క అడుగూ వేయలేదు నేను.

చుట్టూ మనుషులున్నా
నేను మాత్రం ఒంటరినే
నా బాధను పంచుకునే బంధువు
ఎవరో తెలియని అనాథనే.

ఆకలి కేకలు వేసే
నా పసి ప్రాయంలో
అమ్మ అనే పిలుపు ఒక తీరని
కలగానే మిగిలిపోయింది.

కన్నవాళ్ళు నా తోడు ఉంటే
ఈ కష్టం నాకు వచ్చేది కాదేమో
నా కన్నీటిని చూసి లోకం
ఇలా నన్ను ఏడిపించేది కాదేమో.

అమ్మ ప్రేమ రక్షణగా ఉంటే
ఏ బాధ నా దరికి చేరేది కాదేమో
నాన్న చెయ్యి నా తలపై ఉంటే
ఈ ఒంటరి పోరాటం తప్పేదేమో.

కన్నవారి నీడలో పెరిగే భాగ్యం
నాకు ఉండి ఉంటే
నా ప్రతి చిన్న కష్టాన్ని
వారు చిరునవ్వుతో తుడిచేసేవారేమో.

లోకం నన్ను చులకనగా చూసి
గాయపరిచే ప్రతిసారీ,
నాన్న నా వెనుక కొండలా నిలబడి
నన్ను కాపాడేవాడేమో.

అమ్మ లాలన తెలిసి ఉంటే
ఈ గుండె ఇంతగా ఏడ్చేదా
నాన్న ధైర్యం తోడుంటే
ఈ కంటిపాప కన్నీరు పెట్టేదా.

కన్నవాళ్లే నా పక్కనుంటే
కష్టాల చీకట్లు కరిగిపోయేవి
వాళ్ల ప్రేమ వెచ్చదనంలో
కన్నీళ్లు కూడా నవ్వులయ్యేవి.

బడిలో నా తోటి పిల్లలు
ఏదైనా విజయం సాధిస్తే
పరుగున వెళ్లి వాళ్ల
తల్లిదండ్రులకు చెప్పేవారు.

వాళ్ల మాటలు విని
ఆ కన్నవారు మురిసిపోతుంటే
నేను మాత్రం దూరంగా నిలబడి
భారంగా నిట్టూర్చేవాడిని.

నా చిన్న చిన్న విజయాలు
నా మనసులోని ముచ్చట్లు
ఎవరికి చెప్పుకోవాలో తెలియక
నాలోనే దాచుకునేవాడిని.

బాగా చదివావురా అని
వెన్నుతట్టే నాన్న లేడు
ముద్దు పెట్టుకుని దీవించే
కన్నతల్లి అసలే లేదు.

నా సంతోషాన్ని పంచుకోవడానికి
ఎవరూ లేని ఈ లోకంలో
నా విజయాలన్నీ ఒంటరిగా
కన్నీటితోనే కరిగిపోయాయి.
సంధ్య వేళ కాగానే
పిల్లలందరూ ఇళ్లకు వెళ్తారు
అమ్మానాన్నలు ఎదురుచూస్తారని
ఆటలు ఆపేసి పరుగెడుతుంటారు.

కానీ నేను మాత్రం,
ఇంటికి వెళ్లేవాడిని కాదు.
చీకటి పడుతున్నా కూడా
నా అడుగు ముందుకు పడదు.

వెళ్లడానికి ఇల్లున్నా
నాకోసం ఎదురుచూసేవారే లేరు.మ
ఎక్కడికెళ్లావురా' అని ప్రేమగా
గద్దించి అడిగేవారే లేరు.

వాళ్ల ఇళ్లల్లో వెలుగులు
నవ్వుల సడి వినిపిస్తుంటే
నా ఇల్లేమో నిశ్శబ్దంగా
నన్ను చూసి వెక్కిరిస్తుంటుంది

ఇంట్లో ఒక్కడినే పడుకుంటే
చాలా భయం వేసేది
ఆ నిశ్శబ్ద రాత్రిలో
గుండె వేగం పెరిగేది.

అమ్మానాన్నలు తోడుగా ఉంటే
ఆ భయం ఉండేది కాదేమో
చీకటి గదిలో ఒంటరితనం
నన్ను చుట్టేసేది కాదేమో.

ఉలిక్కిపడి లేచినప్పుడు
అమ్మ ఒడి చేర్చేదేమో.
భయపడకురా అంటూ నాన్న
వెన్నుతట్టి నిమిరేవాడేమో.?



కే. నరేందర్
88972 38208

# క్రమశిక్షణే విజయ రహస్యం..!




అనగనగా పచ్చని పొలాలు, చల్లని గాలులు,పక్షుల కిలకిలారావాలతో కళకళలాడే ఒక అందమైన గ్రామం ఉండేది.ఆ గ్రామంలో రాము అనే చిన్న బాలుడు తన తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. రాము చాలా తెలివైనవాడు,చురుకైనవాడు.కానీ అతనికి ఒక పెద్ద లోపం ఉండేది.ఏ పని అయినా సగం వరకు మాత్రమే చేసి వదిలేయడం. మొదట ఎంతో ఉత్సాహంగా ప్రారంభించేవాడు,కానీ కాస్త కష్టం అనిపిస్తే వెంటనే మానేసేవాడు. రాము తండ్రి రైతు.ప్రతిరోజూ పొలానికి వెళ్లి కష్టపడి పని చేసేవాడు.ఒకరోజు తండ్రి రామును పిలిచి "బాబూ! మన ఇంటి వెనుక చిన్న ఖాళీ స్థలం ఉంది. అక్కడ ఒక మామిడి మొక్క నాటుదాం.నువ్వు ప్రతిరోజూ నీళ్లు పోస్తే అది పెద్ద చెట్టవుతుంది.తర్వాత మధురమైన మామిడిపండ్లు ఇస్తుంది" అన్నాడు. రాము చాలా సంతోషించాడు. "అబ్బా! నాకు ఇష్టమైన మామిడిపండ్లు వస్తాయా? నేనే చూసుకుంటా నాన్నా!" అన్నాడు. మరుసటి రోజు తండ్రితో కలిసి చిన్న మామిడి మొక్క నాటాడు.మొదటి రెండు రోజులు ఎంతో శ్రద్ధగా నీళ్లు పోశాడు. మూడో రోజు స్నేహితులు ఆటకు పిలిచారు. "ఈరోజు పోయకపోయినా ఏమవుతుంది?" అనుకుని వెళ్లిపోయాడు. అలా ఒకరోజు... రెండో రోజు....మూడో రోజు...మొక్కకు నీళ్లు పోయడం మర్చిపోయాడు. కొద్ది రోజులకే మొక్క వాడిపోవడం ప్రారంభించింది. ఒక సాయంత్రం తండ్రి చూసి అడిగాడు. "రాము! మొక్క ఇలా ఎందుకు వాడిపోయింది?" రాము తలదించుకుని, "నాన్నా...నేను సరిగా నీళ్లు పోయలేదు" అన్నాడు. తండ్రి కోపపడకుండా ప్రేమగా చెప్పాడు. "బాబూ! ఏ పని అయినా మొదలు పెట్టడం గొప్ప కాదు... దాన్ని చివరివరకు శ్రద్ధగా చేయడం గొప్పది. మొక్కైనా.... చదువైనా...మంచి అలవాటైనా.... ప్రతిరోజూ క్రమంగా చూసుకుంటేనే ఫలితం ఉంటుంది." రాము తన తప్పు తెలుసుకుని చాలా బాధపడ్డాడు. "నాన్నా! ఇంకోసారి అవకాశం ఇవ్వు.ఈసారి తప్పకుండా జాగ్రత్తగా చూసుకుంటా" అన్నాడు.తండ్రి మరో చిన్న జామ మొక్క తీసుకొచ్చాడు. ఈసారి రాము నిజంగా మారిపోయాడు.ప్రతిరోజూ ఉదయం లేచి మొక్కకు నీళ్లు పోశాడు.దాని చుట్టూ ఉన్న కలుపు తీసేశాడు.ఎండ ఎక్కువగా ఉంటే చిన్న నీడ ఏర్పాటుచేశాడు.రోజులు గడిచాయి... నెలలు మారాయి... చిన్న మొక్క పెద్ద చెట్టయింది.కొమ్మలన్నీ పచ్చగా విరిశాయి. కొద్ది కాలానికే చెట్టుకు గుత్తులుగా జామపండ్లు కాసాయి.రాము ఆనందానికి అవధుల్లేవు. మొదటి పండు కోసుకుని తండ్రికి ఇచ్చాడు. "నాన్నా! ఇది మీకోసం.మీరు చెప్పిన మాట వల్లే ఇది సాధ్యమైంది" అన్నాడు.తండ్రి ఆనందంగా, "చూశావా రాము! కష్టం, ఓపిక, క్రమశిక్షణ ఉంటే చిన్న పని కూడా గొప్ప ఫలితాన్ని ఇస్తుంది" అన్నాడు.ఆ రోజు నుంచి రాము చదువులోనూ, పనిలోనూ, ఆటలోనూ క్రమశిక్షణ పాటించాడు.గ్రామంలోని పిల్లలందరికీ ఆదర్శంగా మారాడు.

నీతి: "ఏ పని అయినా మధ్యలో వదిలేస్తే ఫలితం లేదు, పట్టుదలతో పూర్తిచేస్తే విజయం ఖాయం".

-డా.ఓర్సు రాజ్ మానస
తెలుగు అధ్యాపకులు
9849446027



# పుట్టుక ఒకటైనా...





పుట్టుక.. ఒకటైనా...
ఆర్థికమే... మనిషిని వేరు
చేసింది
సమాజాలుగా వర్గాలుగా
విభజన చేసింది
పేద మధ్య ధనికులుగా
వేరుచేసింది తలరాతలు రాసింది
పురిటి నొప్పులు ఒకటైనా
ప్రాణం ఊపిరి ఒకటైనా
ఆత్మ ఒకటైన
పంచభూతాలు అందరివైనా
మనిషి మనిషిని వేరు చేసింది
గత జన్మలఫలమని
ఒక్కమాటతో జవాబు చెప్పింది
ఇది దేవుడు చేసిన కార్యమో
ఎవరు చేసినా పాపమో
తరతరాలుగా తరగతులుగా
స్థితి గతి మారని జీవనము
ఇది ఏ సామాజిక న్యాయమో
పుట్టించినోడిది ఏవిధంగా ధర్మమో
దేవుడు చేసిన విభజనో
ఆధిపత్యం చేసిన ద్రోహమో
మనిషికి మనిషి చేసిన మోసమో
వ్యక్తగత స్వార్థం కోసమో
ఒకవైపు అణచివేత
మరోవైపు ప్రకృతినంతా దోపిడీ
అధికారులుగా సేవకులుగా మారిన సమాజం
అదే చట్రంలో తిరుగాడే అమాయక జనం

షేక్ సలాం
ఖమ్మం
సెల్:: 9963930993



నినాదం
https://hcusahityalahari.blogspot.com
సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 9-08-2026

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064



## పడుగు పేకల అల్లికలు

ప్రకృతిలోని వర్ణాల దారాలతో..
పడుగు పేకలను కూర్చి..
రోజులకు రోజులు ఇంటిల్లిపాదీ కష్టపడి..
చేతితో నేసే జరీపోగుల జలతారు చీరలు!

అగ్గిపెట్టెలో పట్టే చీనాంబరాలు నేసిన
చేనేత కళాకారుల ఖ్యాతి మనది..
నేర్పుగా,ఓర్పుగా,అందమైన కూర్పుతో..
రూపసృజన గావించే హస్త కళలకు
పేరెన్నిక గన్న జాతి మనది!

సాంప్రదాయ కళల కోటగోడలు బద్దలు కొట్టాలని
సామ్రాజ్యవాద దేశాలు యంత్రకుతంత్రం చేసినా..
నక్కజిత్తుల మాయోపాయాలెన్ని పన్నినా..
ఆధునిక రీతులను ఆకళింపు చేసుకొని..
అజరామరమైన మన వారసత్వ కళ
ఇంకా ప్రపంచ మన్ననలందుకుంటూనే ఉంది!

ప్రజలు ఆదరిస్తే..
ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిస్తే..
చేనేత కళాకారులు ఆత్మహత్యలు
చేసుకొనే అగత్యం తప్పి..
మళ్లీ జవసత్వాలు పుంజుకుని..
పునర్వైభవం పొందడం సాధ్యమే!



చంద్రకళ.దీకొండ
హైదరాబాద్
చరవాణి: 9381361384

## సంగమం

"విభిన్న భాష" ల
సంగమం బడి
"కుల మతాల"
సంగమం బడి
"కలిమి లేమి"ల
సంగమం బడి
భిన్నత్వంలో
"ఏకత్వం" బడి



"గనుల"లోని
ముడిసరుకుని
"వజ్రం" లా గా
ప్రకాశింప చేసేది
భావి భారత
"పౌరుల" ను
తయారు చేసే
"కర్మాగారం" బడి

చిన్ని చిన్ని మెదళ్ళలో
"సృజనాత్మకత" ను
"శాస్త్రీయ ఆలోచన"లను
పాదుకొల్పేది బడి
"బాలల హక్కుల"ను
పరి రక్షించేది బడి


నమోదు తక్కువైన
ప్రభుత్వ బడులలో
గతంలో మాదిరిగా
విద్యార్థులను చేర్చి
తిరిగి బడిలో బాలల
"కేరింతల సవ్వడి"ని
కోరుకుందాం అందరం



బాసరాజు యాదగిరి,
చరవాణి
9866255775

# నాలుగు తరాల సామాజిక చరిత్ర

# గునుగు పూలు



1965 తర్వాత వరంగల్ జిల్లాలో మారుమూల గ్రామంలో నాలుగు తరాల మాదిగల వెతలు వివరించే వ్యక్తిగత కథనాలు ఇందులో ఉన్నాయి . నాలుగు తరాల మాదిగల ను సమాజం ఎలా చూసింది వారు సమాజాన్ని ఎలా చూశారు అనే అంశం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. అచ్చమైన సామాజిక చరిత శకలాలివి. తెలుగు దినపత్రికలో జూలై 23 నుండి సెప్టెంబర్ 24 మధ్యకాలంలో ప్రతి వారం రాసిన ఫీచర్ల పుస్తక రూపమిది. వారం వారం పత్రికలో పబ్లిష్ అవుతున్నప్పుడు లక్షలాది పాటకులను అలరించిన రాతలు ఇవి. సమాజంలో కింది వర్గాల పెద్ద సమస్యలను చిరు కథనాల రూపంలో పొందుపరిచిన వైనం బాగుంది. సమాజ శాస్త్ర స్కాలర్ లకు, తెలంగాణ చరిత్రకారులకు, కావాల్సినంతముడి సరుకు ఇందులో ఉంది. సమాజంలో ఏదో మొత్తంలో అన్ని కులాలకు సమస్యలు ఉంటాయి.

కిందికి వెళ్తున్న కొద్దీ ఆ సమస్యల గాఢత బాగా బాగా పెరుగుతుంది. పైనున్నవారికి ఆ గాఢత అర్థమే కాదు. ఈ పుస్తకం చదివితే ఆ వేతలో అర్థం అవుతాయి. వెతలను అనుభవించి బతికి బయటపడిన వారి కథనం ఇది. సమస్యలు తట్టుకోలేక పసిప్రాయంలోనే ఆత్మహత్య చేసుకోవాలని అనుకోవడం దగ్గర్నుంచి అడుగడుగునా ఎందరో అవమానపరుస్తుంటే, ఇబ్బంది పెడుతుంటే తట్టుకొని - ఎదుర్కొని ఓ మోస్తారు విజయం సాధించిన మహిళ నిజాయితీ గా అక్షరబద్ధం చేసిన సంఘటనల సమాహారం ఈ పుస్తకం. కింది కులాల్లో వ్యక్తులు వాళ్ల పేరు వాళ్ళు పెట్టుకోరు, వాళ్ల జీవితాలు వాళ్ల చేతిలో ఉండవు. కులవృత్తి, వెట్టి తప్ప ఇంకో పని చేసుకునే వీలుండదు, పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత కులవృత్తులు కూలిపోయాయి, ఒక్క పూట తిండి లేకపోయినా అడిగే దిక్కు ఉండదు, మధ్యయు గాలనాటి ఆహార, ఆహార్య అలవాట్లు , నమ్మకాలతో వర్తమానంలో బతకడం ఎంత కష్టమో ఈ కథనాల్లో ఉంది. నీది ప్రత్యేక అస్తిత్వం, నీ కులానికి ఒక ప్రత్యేకత ఉంది, అని మెస్మరైజ్ చేస్తూ పశువుల కన్నా హీనంగా బతకమని నిర్దేశించే సమాజంలో, పడుతున్న శ్రమకు సరిపడా ప్రతిఫలం అందివ్వని సమాజంలో ఎక్కువ కష్టాలు కింది కులాల వారికే ఉంటా యి. అందునా మహిళలకు మరిన్ని ఎక్కువుంటాయి. ఆ కష్టాలను వివరించే కథనాలే ఈ పుస్తకంలో ఉన్నాయి. ఏ జాతీయ ,అంతర్జాతీయ స్థాయి రచయితలకు తీసిపోని రీతిలో ఈ కథనాలు ఉన్నాయి. సుభద్ర తల్లి( కనక వీర) కన్న చివరి కాన్పు గొప్పది. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, రావిశాస్త్రి, ముల్కరాజ్ ఆనంద్ (మాల్గుడి డేస్)ఇలాంటి వారెందరో వారి దృష్టి కోణంలో వారి ఇంటిని ,వారి చుట్టూ ఉన్న సమాజాన్ని వ్యక్తీకరించారు.

అందులో దళిత బహుజన జీవితాల జాడలు, ఛాయలు మచ్చుకు కూడా కాన రావు. సుభద్ర కథనాల్లో అది మాత్రమే ఉంది. కాకతీయుల కాలం నాటి ఓరుగల్లు నగర సామాజిక జీవనం వివరించడానికి చరిత్రకారులు పరిశోధకులు దాదాపు నూరు పద్యాలు ఉన్న క్రీడాభిరామం పుస్తకాన్ని ఆధారంగా తీసుకుంటారు. నిజానికి అది కొన్ని పార్శ్వాలు మాత్రమే తడుము తుంది. కానీ సుభద్ర తన కథనాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మూడు నాలుగు తరాల దళితుల (మాదిగల)సమగ్ర జీవితాన్ని వివరించడానికి నిజాయితీగా ప్రయత్నించింది. సఫలమైంది. భాష ప్రామాణికంగా ఉంది. కథనాలు శాస్త్రీయంగా ఉన్నాయి. అందరూ చదువు తగిన పుస్తకం ఇది.

**- దుర్గం రవీందర్**

# అసలు సిసలైన పల్లె పదాల పొత్తం

# ఆరుద్రపురుగు



***కూకట్ల తిరుపతి రాసిన 37 వచన కవితల సంపుటి "ఆరుద్ర పురుగు". ఇందులోని అన్ని కవితలు తెలంగాణ భాషలో నడిచినవి. వస్తువులన్నిటిలో తెలంగాణతనమే ఉంటది. అంటే తెలంగాణ పండుగలూ పబ్బాలు, అతుకుల బతుకులు, పోరాటాలూ త్యాగాలు వగైరా. ఇంత మంచి పుస్తకం పరిచయం చేసే అవకాశం నాకు దొరికినందుకు ముందు తిరుపతన్నకు శెనార్థులు. కవి తన మనో భావాలకు అక్షర రూపం ఇవ్వడమంటే...! అది పాల సముద్ర మథనమే...! ఆవేదనలను రంగరించి అక్షరామృతాన్ని అందివ్వడానికి కవి తన ఆలోచనల్ని ఎంతగానో మథిస్తే తప్ప కవితామృతాన్ని పాఠక లోకానికి పంచలేడు.***

ఇక ఈ కవితలలో మనుషుల మధ్యగల మానవీయ సంబంధాల విలువలను ఏకరువు పెడతాడు. విశ్వాసం గల ఒక జంతువు పట్ల మనుషులు చూపే ప్రేమను "కడేసిన కర్రె గొంగడి... భుజంపై ఏసుకొని... పచ్చి పాలు ఓసి పావురంగా పెంచుకున్న జంతువు. సెంగలిచ్చుకుంటా కాళ్ళల్ల కలె మెదులుకుంటా... రెక్కలల్ల, బొక్కలల్ల పెరిగిన పాణం. మందకు వందల మంది బోయిల పెట్టు ఒకతే కాపలగా వుండే..." ఒక మూగజీవి గురించి బాగా చెప్పినవు అన్నా..."మా తాత యాదిలో... " శీర్షికన రాసిన కవిత పాఠకులను ఆలోచింపజేస్తుంది. జంతు ప్రేమ ఆవశ్యకతను తెలుపుతుంది. పశువులను మాలిమి చేసుకోవలసిన అవసరాన్ని ఏకరువు పెడుతుంది.

చెరువు కుంటల్ల అడుగున పేరుకపోయిన మెత్తటి మట్టిని ఈ కవి మీగడతో పోల్చటం... కుమ్మరోల్ల బతుకుల గురించి, మాగిన మట్టిని తెచ్చి, తడిపిన బంకమట్టితో ఆల్లు సేసె అస్తువుల గురించి, ముఖ్యంగా మట్టిపూల ఆసనను వర్ణించిన తీరు బాగుంది. "మట్టి పూలు ఒక మనాది" కవిత ప్రపంచీకరణ మోసాన్ని తేటతెల్లం చేసింది. చేతులిరిగిన చేతివృత్తుల బాధను కళ్ళకు కట్టింది. మన తెలంగాణను ఎప్పటికీ ఏలుదామనుకున్న ఆంధ్రోళ్లను తరిమికొట్టిన సింహగర్జన లాంటి కవిత్వం "హైదరాబాద్ సిర్ఫ్ హమారా". హైదరాబాదు పట్టణాన్ని భారత దేశ రెండవ రాజధానిగా చేయాలన్న కుట్టలను, కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలన్న కుయత్నాలను చాకచక్యంగా తిప్పి కొట్టిన కవి ఖలేజా ఇందులో కనపడుతుంది. "ఉడుం లెక్క వచ్చి... పున్నమి జీవితాలల్ల... అమాస తెచ్చింద్రు... ఖబర్దార్ బిడ్డా! నా నేలను ఇడిసి, ముల్లె మూట సదరుకొని పోకుంటే... గండి మైసమ్మ కాడ గావు వడతా బిడ్డా..." ఈ హెచ్చరిక చాలా బాగుదన్నా! ఇదీ కదా! తెగించిన కొట్లాట. తెలగోలుజేసే పంచాది. ఆంధ్ర తెలంగాణ లొల్లిని శేక్ పాక్ చేసిన కవిత ఇది. అట్లనే "తెలంగాణ అచ్చిన సంబరంల సోయి తప్పి... ఇప్పుడే పురుడువోసుకున్న పసిబిడ్డ బొడ్డు తాడుకు బదులు బొండిగ కోసేరు? భౌగోళిక తెలంగాణ కాదు... సామాజిక తెలంగాణ రావాలి" అని ఆరం కవితలో చెప్పిన తీరు ఆకట్టుకుంటుంది. దండు కట్టింది. దరువు లేసింది. ధూంధాంల దమ్ములేపింది బహుజన దండులే కదా! ఆ ఆరాటం, పోరాటం ఆకుపచ్చ తెలంగాణగా మారాలని అక్షరాల కేక పెట్టిన తెలంగాణ అస్తిత్వవాద కవి కూకట్ల తిరుపతి.

"నెత్తికెత్తుకొనే రోజులు" కవితలో బతుకమ్మ పూల గురించి చెప్పిన తీరు ముచ్చటేస్తది. తీరొక్క పూల వర్ణన బడుగు జీవుల బతుకు చిత్రాలుగా గీశారు. బతుకమ్మకు పనికిరాని పువ్వు అంటూ ఏదీ ఉండదుగా... గుడికి, జడకు నోసుకొని పువ్వులు. ఆదరణకు, అందలానికి ఆశపడక, ఉద్యమానికి ఊతమయినయి. వెలేసిన మనుషులు, వెలుతురు సోకని జీవితాలకు కూడా ఒక రోజు వస్తుంది. అని కవితాత్మకంగా చెప్పడం సముచితంగా ఉంది. ఇది బడుగు జీవుల కోసం భరోసా గీతం పాడినట్టుగా ఉంది. ఇలానే "తంగేడు పువ్వు" కవిత్వ వర్ణన చాలా బాగుంది. ఇందులో తంగేడు ఔషధ గుణాలను సవివరం చేశారు. తెలంగాణ రాష్ట్ర పుష్పంగా తంగేడును గుర్తించడం సముచితమంటారు. ఈ కవితలో స్వభావోక్తి అలంకారం కనబడుతుంది. ఎన్కటికెల్లి వొత్తున్న తెలంగాణ ప్రాంత ఆచారాలు, ప్రజల సంప్రదాయాలు ఎంతో గొప్పవి. ముఖ్యంగా గొల్ల, కురుమల మల్లన్న బోనాలు, పంచవన్నెల పట్నాల గురించి రాసిన కైతలు సహజంగా ఉన్నాయి. నియ్యతి గల్ల జీవితాలకు అద్దం పడుతున్నట్టుగా ఉన్నాయి. దేశీ మూలాల సోయిని ఎరుక జేస్తున్నాయి. "శరణు మల్లన్న", "పొలమ రాజుల పండుగు" కవితలు ఇందుకు ఉదాహరణలు. అస్తిత్వవాదానికి ఆనవాళ్లుగా నిలిచిన అక్షరాలు. ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచిన అల్లికలు. అన్నిటి కంటే మన తల్లిభాష గొప్పదనం గురించి మాబాగా రాసిండన్న. బడికి పోయేదాక అమ్మ బాష మాట్లాడిన పిల్లలు, బడికి పోయినంక బల్లె పంతులు చెప్పే పాఠాల భాష మాట్లాడుతారు. ముఖ్యంగా బడి పంతులు సెప్పిన ప్రమాణిక భాషా పాఠం. జీవరసం కలిగిన తెలంగాణభాషను ఎలా తొక్కేసిందో తెలుస్తుంది." ఆయిల్లా ఆన అచ్చి ఆకిట్ల అడ్లుతడిసినయి..."దీన్ని బల్లె పంతులు పిల్లలతో సెప్పించిన వైనం "రాత్రి వాన వచ్చి వాకిట్లో వడ్లు తడిసినయి"అని సానిగా నేర్పిన పాఠం. విద్యార్థులను ఇంటి భాషకు దూరం జేసింది. "మనకు బడి పలుకుల భాష కాదు. పలుకు బడుల భాష కావాలే" - కాళన్న చెప్పిన మాటలను ఇప్పటి కన్నా నిలబెట్టుకొందాం. తల్లి తెలంగాణ భాషను ఇకనైనా తెర్లుగాకుండా చూసుకుందాం.

తెలంగాణ వ్యవహారంలో మాత్రమే కాదు. ఇప్పడికీ తెలంగాణ పాఠ్య పుస్తకాలను ఆంధ్ర భాషనే ఏలుతుంది. తెలంగాణ అచ్చినాక పాఠ్య పుస్తకాలలో కొంత మార్పు వచ్చినా, ఇంకా మన తెలంగాణభాషలో బొత్తిగా పాఠాలు రాక పోవడం దురదృష్టం కాదా! పాఠ్య పుస్తకాలలో మన తెలంగాణ కవులను ఎనభై శాతం మందిని పరిచయం చేస్తున్నారు. సీమాంధ్ర కవులకు ఇరవై శాతం అవకాశం ఇస్తున్నారు. మన తల్లిభాష క్రియా పదాలను, మన ఇంటిభాష పలుకుబడులను పూర్తిగా తీసుకు రావడం లేదు. వలస భాషా పెత్తనం వలన మన తల్లిభాష మీద పూర్తి పట్టు ఎవరికి లేకుండా పోతున్నది. మన భాషల మాట్లాడుడు మోటు అనుకుంటున్నారు. మన తెలంగాణ పోరు గడ్డ, ఉద్యమాలకు ఊపిరి పోసే నేల తల్లి. అలాంటి మన తల్లి భాషకు సరైన గౌరవం దక్కలేదు. సమాజంలో కొంత మార్పు వచ్చినా, అసలు సిసలైన భాషకు ఇంకా అన్యాయమే జరుగుతున్నది. అస్తిత్వవాద కవి కూకట్ల తిరుపతన్న చెప్పినట్లుగా తెలంగాణ భాషకు సమగ్రమైన పదకోశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. తెలంగాణ భాషలో రాసిన ఇలాంటి రచనలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం సంయుక్తంగా తెలంగాణ భాషా సాహిత్యాలు, మరియు సంస్కృతి, చరిత్ర సంరక్షణ పనులకు పూనుకోవాలి.

రాజన్న సినిమాలో నైజాం కాలంల ప్రజలు ఎదురుకున్న కష్టాలు, ఆడవాళ్ళను వాళ్ళు పెట్టిన బాధలు, గఢీల దొరసాండ్లు, దొరల పెత్తనంతో జనాలు వడ్డ అవస్థలు చూపెట్టారు. మన ఆత్మ గౌరవాన్ని, భాషను కాపాడుకోవడానికి మన వాళ్లువడ్డ బాధలను చూపించడం నాకు బాగా నచ్చింది. అలాంటి సినిమాలు ఇంకా రావాలి. జనాలను చైతన్య పరచాలి. "జీల్గుల జాతర", జిలాల గుట్ట, బతుకు సోగడ" పేర్లతో తిరుపతన్న ఎంతో ఆవేదనతో రాసిన కవితలు. ఇప్పటికీ విచ్చల విడిగా జరుగుతున్న వనరుల విధ్వంసం, దోపిడీల గురించి జనాన్ని మేలుకొల్పె రచనలు ఇంకా రావాల్సిన అవసరముంది. కూకట్లన్న ఇలానే ఇంకా ఇంకా... మన భాష గురించి రాయాలని ఉంది. ఇప్పటికైనా తెలంగాణ జనం సోయికి రావాలే. బల్లె పాఠాల కాడి నుండి మొదలుకొని, అందరూ మన తెలంగాణ భాషను మాట్లాడితే ఎంతో బాగుంటది. భాషను కాపాడుకుంటేనే మన ఉనికి, మన మూలాలు బతికి బట్టకడుతయి. ముందు తరాలకు గూడా సరిగ్గా అందుతయి. మన కవులు రచయితలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో మనభాషలో రచనలు విరివిగా చేశారు. రాష్ట్ర ఆకాంక్షను బలంగా చాటారు. జనాన్ని ఉద్యమ బాట పట్టించారు. అదే రీతి ఎప్పటికీ కొనసాగవలసిన అవసరముంది. తాను కలం పట్టిన నాటి నుంచి నేటి వరకు దాదాపు మూడు దశాబ్దాలుగా అచ్చ తెలుగు భాషలో కవిత్వం రాస్తున్న కూకట్ల తిరుపతన్న అభినందనీయులు. అచ్చమైన తెలంగాణ భాష, నుడికారం, జాతీయాలు, పలుకుబడులు, పద బంధాల కూర్పుగా కవితల పేర్పుగా వచ్చిన అపురూపమైన పొత్తం "ఆరుద్ర పురుగు"కు అలయి బలయి. కూకట్ల తిరుపతన్న కలం నుండి మరిన్ని అస్తిత్వ వాద రచనలు జాలువారాలని మనసారా కోరుకుంటున్నాను. ఇప్పటికిప్పుడు తెలంగాణ భాషను కాపాడుకోవడం కోసం ఏదన్నా ఉద్యమం వస్తే మంచిగుండు. పరాయి భాషల పెత్తనాన్ని తొక్కేస్తే బాగుండు. బుద్ధిజీవులంతా కలిసికట్టుగా పోరాడితే బలంగావుండు.

**ప్రతులకు: కూకట్ల లక్ష్మి, ఇ.నం : 1-29/1,గ్రామం: మద్దికుంట, మండలం: మానకొండూర్, జిల్లా: కరీంనగర్.**



బోయిని సరోజ పోచమల్లు
మందమర్రి, మంచిర్యాల జిల్లా.
తెలంగాణ రాష్ట్రం.



## అంతరం

మనిషి అంతరాలలో దాగి ఉన్న ఈ అంతరం
మనిషికి మనిషికి మధ్య పెద్ద గోడ వలే నిలిచే ఈ అంతరం
విభేదాలను సృష్టించేది ఈ అంతరం
ప్రేమ మైత్రి సంబంధాలను గుర్తించనివ్వనిది ఈ అంతరం
పెద్ద చిన్న తారతమ్యాలను చూపేదే ఈ అంతరం
కులమత భేదాలను సృష్టించేదే అంతరం
నీది నాది అని లెక్కలేసేదే ఈ అంతరం
అంతరాలను అంతమొందించడానికి
నడుము కట్టాలి నేటి యువతరం
అదే అసలైన విజయానికి వరం

ఆరిశెట్టి రేవతీ గుప్తా
సాలూరు, విజయనగరం జిల్లా
ఆంధ్ర ప్రదేశ్
ఫోన్: 8019127668



## చివరి మరణం

అన్ని కథలూ
జరిగిన వాటితో ముగియవు
జరగకుండా మిగిలిపోయినవి
ఎక్కువకాలం బతుకుతాయి

అందుకనే ,
' ఒకవేళ ' అనే పదం
మనిషి కనిపెట్టిన అత్యంత మొండిపట్టుదల .
అది ఉన్నంతవరకు
ఏ ముగింపూ పూర్తికాదు

ఒకరోజున
' ఒకవేళ ' కూడా
తన అర్థాన్ని కోల్పోతుంది
జరగనిదానికి ఇక సంభావ్యత లేదని
నిరీక్షణ చేతులెత్తినప్పుడు
అదే ఆ కథయొక్క చివరి మరణం .



మండాది గోపీనాథ్
ముక్కుడు దేవులపల్లి
సెల్ : 9885045344



## భవిత నీదే

భవిత బెదిరించినా
ప్రతిభ ప్రశ్నార్థకంగా మారినా
ఆదరించాల్సిన వారే అవహేళన చేసినా
చేయూత అందించాల్సిన
నీ వారే నిన్ను కృంగదీసినా
ఓటమి నిన్ను బాధించిందని
ప్రయత్నించడం మానేయకు నేస్తం
నీ కోసం
నీ గెలుపు కోసం తమ జీవితాలను
త్యాగం చేస్తున్న
నీ తల్లిదండ్రుల మోముపై
చిరునవ్వు వికసించేలా
నిన్ను హేళన చేసిన వారే
కీర్తించేలా..
అందరికీ శాశ్వత కాలం గుర్తుండిపోయే
గొప్ప విజయం కోసం
నీలోని శక్తి సామర్థ్యాలన్నీ కూడగట్టుకుని
ఆఖరి ప్రయత్నమే విజయపతాకంగా చేసి
ఆ విజయం తాలుకు ఆనందాన్ని
నీ తల్లిదండ్రులకు
రుచి చూపించు నేస్తమా.



గంజి. కుమార్ రాజా
పరిశోధక విద్యార్థి
7730896943

# అలసట లేని జీవితం కోసం

కొన్ని కథలు
పుస్తకాల్లో వెతికితే దొరకవు!
జీవితాలను తడిమి చూడాలి!
జీవనాన్ని తరిచి చూడాలి!
ఏ చెట్టు కిందో
నిశ్శబ్దంగా కనిపించవచ్చు!
ఏ పుట్ట పక్కనో
తవ్వాడుతూ కనిపించవచ్చు!
చెప్పలేం!
ఎవరి కథ ఎలా రాసుందో
ఇదిమిద్ధంగా ముగింపుకు రాలేము!
జీవితం ఎవరిదైనా
కొన్ని క్షణాల్లో మార్చేయవచ్చు!
నీడలో కూర్చున్న వాళ్ళు



నిశ్శబ్దంగా తెరమరుగు అయిపోవచ్చు!
నిన్న ఎవరికో అండగా ఉన్నవాళ్లు
ఈరోజు వాళ్ళకి అడ్డమైపోవచ్చు!
ఏమో! చెప్పలేం!
కొందరు బ్రతుకులు అజి దొరకాలంటే
వెతకవలసింది పూల తోటల్లో కాదు

ముళ్ల పొదలను గాలించవలసిందే!
ప్రతి ముల్లు వెనుక
ఒక అనుభవాల గాయం ఉంటుంది!
ప్రతి చుక్క కన్నీటి వెనుక
వెలుగు కోసం సాగే అన్వేషణ ఉంటుంది!
కాలాన్ని శాసించలేంగాని
కన్నీటితో కాగితం తడవకుండా
బ్రతుకు పుస్తకాన్ని తిరిగి రాయగలం!
గమ్యం ఎక్కడైనా
గమనం ఆగిపోకూడదనే నిజాన్ని
గుండెల్లో దాచుకోగలం!
నిలువెల్లా గాయాలైనా
నింగిని తాకే ఆశ మాత్రమే
ఎప్పటికీ చావకూడదు!

కథ ఏదైనా కానీ
ముగింపు ఎలాగైనా ఉండని
అలసట లేని ప్రయాణంలో
గమ్యం కంటే గురి ముఖ్యం!
రేపటి ఉదయం కోసం
చీకటిని చీల్చుకుంటూ సాగే ప్రయాణమే
నిజమైన జీవితం!
రేపటి తెల్లవారే వెలుగు కోసం
ఈ చీకటి రాత్రంతా సాగే
పోరాటమే జీవనం!



డా. గూటం స్వామి
రాజమహేంద్రి
9441092879

నినాదం
https://hcusahityalahari.blogspot.com
సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 9-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# భారతీయ సాహిత్యం అంటే ఏమిటి?

**"ఈ నేల మీద ఒక అనుభూతి/ఋషుల నిశ్శబ్దంలో మంత్రంగా మారింది/ తరతరాల జ్ఞాపకాల్లో కథగా నిలిచింది / ఈ నేలమీద అనుభవం/ మనిషిని నడిపించే విజ్ఞానమయ్యింది/వేదాల నుంచి ఉపనిషత్తుల దాకా/మనిషి బయట ప్రపంచాన్ని చూస్తూనే/తనలోని విశ్వాన్ని వెతుక్కుంటూ వచ్చాడు./ఇక్కడ పుట్టిన కథ, పద్యం, గేయం, కావ్యం, పురాణం.../ జీవితాన్ని చూసే ఒక కొత్త చూపునిచ్చింది/ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటింది..."**

ఈకవిత భారతీయ సాహిత్యం గురించి గతంలో నేను రాసుకున్నది. ఆ కవితలోని భాగాలను సందర్భానుసారంగా ఈ వ్యాసంలో పెడుతున్నాను.

భారతీయ సాహిత్యం అంటే ఏమిటనే ప్రశ్నకు ఒకటి రెండు మాటల్లో సరైన సమాధానాన్ని చెప్పేయలేం. ఈ రంగంలో విశేషమైన కృషిచేసిన వారు దీన్ని నిర్వచించే ప్రయత్నం చేశారు. భారతదేశంలో విభిన్న కాలాల్లో, వివిధ ప్రాంతాల్లో, అనేక భాషలలో సృష్టించబడిన సమగ్ర సాహిత్య సంపదనే "భారతీయ సాహిత్యం" (Indian Literature) అంటారు. భారతదేశం బహుభాషా సంస్కృతికి నిలయం. అస్సామీ, బెంగాలీ, గుజరాతి, హిందీ, కన్నడ, కాశ్మీరీ, మలయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, సంస్కృతం, తమిళం, తెలుగు, ఉర్దూ వంటి ఎన్నో అధికారిక, ప్రాంతీయ భాషలు ఉన్నాయి. భారతరాజ్యాంగం గుర్తించిన 22 భాషలతో పాటు మరికొన్ని గుర్తింపులేకపోయినా, సాహిత్యాన్ని సృష్టిస్తున్న భాషల సాహిత్యం, ఈ భాషలన్నింటిలోనూ వచ్చిన మౌఖిక, లిఖిత, పద్య, గద్య, దృశ్య (నాటక) రూపాలన్నింటినీ కలిపి సాధారణ పరిభాషలో 'భారతీయ సాహిత్యం'గా పరిగణిస్తారు. నోబుల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ అభిప్రాయం ప్రకారం.. "భారతీయ సాహిత్యం అంటే బహుళ భాషల్లో, వైవిధ్యమైన సంస్కృతుల్లో వ్యక్తమవుతున్న 'ఒకే భారతీయ ఆత్మ' అనంతమైన సృజనాత్మక ప్రయాణం. ఇది సంకుచిత పరిధులకు అతీతంగా, యావత్ మానవాళికి భారతదేశం ఇస్తున్న ఆత్మీయ సందేశం.

భారతీయ సాహిత్యాన్ని కొంతమంది ప్రత్యక్షంగా నిర్వచిస్తే, మరికొంతమంది తమ సాహిత్యంలో భాగంగా అక్కడక్కడా సందర్భానుసారంగాను, సృజనాత్మక సాహిత్యంలో తమ భావజాలంగాను వివరించారు. "భారతీయ సాహిత్యం అంటే ఒకటిగా కనిపిస్తుంది, కానీ అది అనేక భాషలలో లిఖించబడిందని (Indian literature is one though written in many languages) డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ప్రముఖ బెంగాలీ కవి, విమర్శకులు శిశిర్ కుమార్ దాస్ తన "A History of Indian Literature" గ్రంథంలో భాషాపరమైన వైవిధ్యం ఉన్నప్పటికీ, ఇతివృత్తాలు, సామాజిక స్పృహ భారతీయులందరికీ ఉమ్మడిగా ఎలా ఉంటాయో చెప్తూ "భారతీయ సాహిత్యం అనేది వివిధ భారతీయ భాషలలో వెలువడిన సాహిత్యాల సముదాయం. భాషలు వేరైనా ఇవన్నీ చారిత్రక, భౌగోళిక మరియు సాంస్కృతిక బంధాలతో విడదీయరాని విధంగా పెనవేసుకుని ఉంటా"యని అన్నారు. మాతృభాష బెంగాలీ అయినప్పటికీ, ఆయన తన సాహిత్య విమర్శ, పరిశోధనా గ్రంథాలను ప్రధానంగా ఆంగ్లంలో రచించిన సుజిత్ ముఖర్జీ రాసిన "Towards a Literary History of India" అనే గ్రంథంలో కేవలం సంస్కృతం లేదా హిందీ మాత్రమే కాకుండా, ప్రాంతీయ భాషలన్నింటినీ సమానంగా పరిగణించి కలుపుకుని చూసినప్పుడే 'భారతీయ సాహిత్యం' అనే పదానికి సార్ధకత చేకూరుతుందని ముఖర్జీ నిర్వచిస్తూ **"భారతీయ సాహిత్యాన్ని విడివిడి భాషల చరిత్రగా కాకుండా, బహుభాషా సమాజం సృష్టించిన ఒకే ఏకీకృత (Pluralistic) సాహిత్య సంప్రదాయంగా చూడాలి."** అన్నారు. ప్రముఖ గుజరాతీ కవి, విమర్శకులు ఉమాశంకర్ జోషి **"నేను ఒక భారతీయ రచయితను, కానీ గుజరాతీలో రాస్తాను."** (I am an Indian writer writing in Gujarati) అని వ్యక్తపరిచిన ఈ ప్రసిద్ధ వాక్యం భారతీయ సాహిత్య స్వభావాన్ని అత్యంత క్లుప్తంగా నిర్వచిస్తుంది. రచయిత ఉపయోగించే మాధ్యమం (భాష) ప్రాంతీయమైనప్పటికీ, అతని ఆలోచన, అస్తిత్వం 'భారతీయత'కు ప్రతిరూపంగా కనిపిస్తుంది. బెంగాలీ భాషకు చెందిన సునీతి కుమార్ ఛటర్జీ అభిప్రాయంలో **"భారతీయ సాహిత్యం అనేది భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే ఒక మేధోపరమైన మరియు ఆధ్యాత్మిక ప్రయాణం. ఇందులో రామాయణ, మహాభారతాల వంటి ఇతిహాసాల నుండి ఆధునిక కవిత్వం వరకు ఒకే విధమైన సామాజిక విలువలు ప్రతిబింబిస్తాయి."** తెలుగులో జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన విశ్వనాథ సత్యనారాయాణ అభిప్రాయంలో **'భారతీయ దర్శనం'** (Indian Philosophical Vision) లేనిదే భారతీయ సాహిత్యం లేదు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణ మహాభారతాల్లో చెప్పబడిన **'ధర్మం', 'కర్మ సిద్ధాంతం', 'పునర్జన్మ విశ్వాసం'** వంటి తాత్విక పునాదుల మీద నిర్మితమైనదే నిజమైన భారతీయ సాహిత్యం. గుర్రం జాషువా భారతీయ సాహిత్యం మనిషిని మనిషిగా గౌరవించే మానవతావాదాన్ని బోధించాలని నమ్మారు. రాతి విగ్రహాలకు పాలాభిషేకాలు చేస్తూ, తోటి మనిషిని తాకితే మైల పడతామని భావించే నాటి హిందూ సమాజపు ద్వంద్వ ప్రమాణాలను ఆయన తన కవిత్వం ద్వారా తీవ్రంగా ప్రశ్నించారు. ఆయన కవిత్వానికి కేంద్ర బిందువు నిఖార్సయిన **'విశ్వమానవ సౌభ్రాతృత్వం'**. జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా. సి.నారాయణ రెడ్డి భారతీయ సాహిత్యాన్ని భాషాపరమైన గోడలు లేని ఒక **'అభ్యుదయ, మానవతావాద ప్రవంతి'**గా చూశారు. భాషలు అనేవి కేవలం దేహాలు మాత్రమేనని, వాటిలో ప్రవహించే **'ఆధునిక మానవతా వాదమే'** నేటి భారతీయ సాహిత్య ఆత్మ అని ఆయన సమన్వయించారు. గుంటూరు శేషేంద్ర శర్మ భారతీయ సాహిత్యం అనేది కేవలం మత గ్రంథాల సముదాయం కాదని, అదొక గొప్ప సామాజిక, మానసిక విజ్ఞాన శాస్త్రమని (Science of human consciousness) అభిప్రాయపడ్డారు. తెలుగు కవులు, విమర్శకుల అభిప్రాయం ప్రకారం భారతీయ సాహిత్యం అంటే గతం నుండి వారసత్వంగా వస్తున్న **'ప్రాచీన తాత్విక దర్శనం'**గాను, వర్తమానంలో సామాన్యుడి పోరాటాలను ప్రతిబింబించే **'సామాజిక వాస్తవికత'**ల సమ్మేళనంగా భిన్న దృక్పథాలతో చూశారు. ప్రపంచంలోని పీడిత వర్గాలందరి ఆవేదన ఒకటేనని, భారతీయ సాహిత్యం ఆ అంతర్జాతీయ శ్రామిక వర్గ పోరాటంలో ఒక భాగం కావాలని శ్రీశ్రీ భావించారు. ఇలా ఒక్కొక్కరి అభిప్రాయాలను క్రోడీకరించే అవకాశం ఉంది. మొత్తం మీద భిన్న దృక్పథాలు ఉన్నప్పటికీ, భారతీయ సాహిత్యాన్ని సంస్కృతం వంటి ప్రాచీన భాషల నుంచి ప్రాకృత భాషగా విస్తరించి, జానపద కళారూపాల వరకు ప్రతిదీ ఈ సాహిత్య నిర్మాణంలో భాగమే భారతీయ సాహిత్యం. అందుకే **"అనేక భాషలు – ఒకే అంతరాత్మ"** అనేది భారతీయ సాహిత్యానికి సరైన నిర్వచనంగా చెప్పవచ్చు.

భారత దేశంలోని వివిధ భాషల్లో వేర్వేరు సాహిత్యాలు వచ్చినప్పటికీ, వాటి అంతర్వాహినిగా భారతీయ జీవన విధానం, ఆధ్యాత్మికత, మానవతా విలువలు ఒకే రకంగా కనిపిస్తాయి. ఇది భిన్నత్వంలో ఏకత్వాన్ని (Unity in Diversity) సూచించే ఒక ముఖ్యమైన లక్షణం. రామాయణ, మహాభారతాలు అనే ఇతిహాసాలు భారతీయ సాహిత్యానికి రెండు కళ్ళలాంటివి. దేశంలోని ఏ భాషా సాహిత్యాన్ని పరిశీలించినా ఈ ఇతిహాసాల ప్రభావం, వాటి ఆధారంగా రూపుదిద్దుకున్న కథలు స్పష్టంగా గోచరిస్తాయి. భారతీయ సాహిత్యంలో ధర్మం (కర్తవ్యం), సత్యం, అహింస, గురుభక్తి, పితృవాక్యపాలన వంటి నైతిక విలువలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం మరో ముఖ్యలక్షణం. భారతీయ సాహిత్యం వేద కాలం నాటి మౌఖిక సంస్కృతి (శ్రుతులు, స్మృతులు) నుండి ప్రారంభమై, సంస్కృత-ప్రాకృత సాహిత్యాల ద్వారా మధ్యయుగ భక్తి సాహిత్యం సంతరించుకుని, నేటి ఆధునిక ప్రజాస్వామ్య, విప్లవ, ప్రగతిశీల సాహిత్యాల వరకు నిరంతరం ప్రవహిస్తుందనే కాలక్రమ పరిణామాన్ని సూచిస్తుంది.

**"ఇది ఒక్క భాషో/ఇది ఒక్క సాహిత్యమో కాదు/కాశ్మీర్ మంచులోంచి/ కన్యాకుమారి సముద్రం దాకా/ బెంగాల్ నది ఒడ్డునుంచి/ గుజరాత్ ఎడారి దాకా/ ఎన్ని భాషలు, ఎన్నిపలుకుబడులు/ ఎంతమంది దేవతలు, ఎన్నితిరుగుబాట్లు/, ఎన్నికన్నీళ్లు, ఎన్నికలలు!/ అన్నీ కలిసి/ఒకే భారతీయ అనుభూతిని నిర్మించాయి."**

## భారతీయ సాహిత్యాన్నెందుకు అధ్యయనం చేయాలి?:

భారతీయ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అనేది ఒక జాతి ఆత్మను అర్థం చేసుకోవడం కోసం చదవాలి. అది భారతీయ సాహిత్యమే కాదు, ఏ దేశ సాహిత్యమైనా మౌలికంగా ఇదే పనిచేస్తుంది. అయితే, ప్రపంచంలో మరే దేశానికీ లేనంత సుదీర్ఘమైన, వైవిధ్యమైన సాహిత్య చరిత్ర భారతదేశానికి ఉందని సాహితీవేత్తలు భావిస్తుంటారు. ఈ కింది అంశాల ద్వారా భారతీయ సమగ్రతను, సమైక్యతను కాపాడుకోవడానికి భారతీయ సాహిత్యాన్ని చదవాలి. అంతే కాదు, ఎందుకు చదవాలో ఈ ఉపశీర్షికల ద్వారా అవగాహన చేసుకోవచ్చు.

**"ఇక్కడ/భాషలు వేరు భావం ఒకటే./పేర్లు వేరు మనిషి అనే వృక్షం ఒక్కటే./కథలు వేరు జీవితం ఒకటే./ భారతీయ సాహిత్యం/ ఒక పుస్తకం కాదు./అది వేల సంవత్సరాలుగా/ మనిషి తనను తాను/ చదువుకుంటున్న/ ఒక అనంతమైన సమైక్య గీతం."**

సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ


**"వ్యాసుడు/మనిషి హృదయంలోని/అన్నిరంగులనూ చూపించే ఒక అద్దం/తనను తాను ఒక నదిలా ప్రవహించుకుంటూ/తీరాలన్నీ మానవ జీవనాలయ్యాయి;/ఆ ప్రవాహం చివరికి/విశ్వమే ఒక మహాకథగా/తనలోతాను ప్రతిధ్వనించింది."**

భారతీయ సాహిత్యం మన ప్రాచీన ఆచార వ్యవహారాలకు, కళలకు, సాంస్కృతిక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. రామాయణ, మహాభారతాల వంటి ఇతిహాసాలు నాటి ఉమ్మడి కుటుంబ, సామాజిక విలువలను భద్రపరచాయి. **"వాల్మీకి/ఒక మనిషి/మరొక మనిషి కోసం/ కరిగిపోయిన క్షణాల్ని కావ్యంగా మార్చాడు./ఒక కన్నీటి చుక్కలో/ మానవ హృదయపు విశ్వాన్ని చూపాడు/ఆ స్పందనే/రామాయణమై యుగాల్ని దాటింది."**

రామాయణ, భారత, భాగవతాలతో పాటు భారతీయ సాహిత్యం ద్వారా **'క్రీడాభిరామం', 'పల్నాటి వీరచరిత్ర'** వంటి కావ్యాలు స్థానిక జనజీవనాన్ని, వినోదాలను కళ్లకు కట్టాయి. అలాగే బసవన్న, కబీరు, పోతన వంటి కవుల భక్తి, జానపద రచనలు అగ్రవర్ణాలకే పరిమితం కాకుండా సామాన్యుల శ్రమను, పల్లె వాతావరణాన్ని అద్భుతంగా రికార్డు చేశాయి. మొత్తంగా ఈ సాహిత్యం ఎగువ స్థాయి నుండి సామాన్యుల వరకు అందరి జీవన విధానాలను పొందుపరిచి, ఒక తరం నాటి సాంస్కృతిక చిత్రాన్ని భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించే కాల యంత్రం (టైమ్ మెషీన్) లా పనిచేస్తుంది.

**"అతడు/ ధర్మం ముందు/ మనిషిగా నిలబడిన ఒక ప్రశ్న/. ఆమె/ ఎన్నిఅరణ్యాలు దాటినా/తన అంతరంగంలో/తన అస్తిత్వాన్నికాపాడుకునే/ స్త్రీ శక్తికి ఒకనిశ్శబ్ద ప్రతీక."**

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం బహుభాషా, బహుళ సంస్కృతుల నిలయమైనప్పటికీ, భారతీయ సాహిత్యమంతటా **'భిన్నత్వంలో ఏకత్వం'** అనే ఒకే భావజాలం అంతర్లీనంగా ప్రవహిస్తుంది. వివిధ భాషల్లో వెలువడిన రామాయణ, భారతాలు బోధించే ఉమ్మడి ధర్మం, దేశవ్యాప్తంగా సాగిన భక్తి ఉద్యమ కవుల రచనలు జాతిని ఆధ్యాత్మికంగా ఎలా ఏకం చేశాయో; ఆధునిక కాలంలో ఠాగూర్, సుబ్రహ్మణ్య భారతి, ప్రేమ్ చంద్, గురజాడ వంటి రచయితలు విభిన్న భాషల్లో పేదరికం, అంటరానితనం, వలసవాద వ్యతిరేకతలపై చేసిన సమాంతర పోరాటం కూడా అదే ఏకత్వాన్ని చాటుతుంది. భాషలు, స్థానిక వర్ణనలు వేరైనా వాటి ఆత్మ, సామాజిక ఆవేదన ఒకటేనని నిరూపిస్తూ.. ఈ ప్రాంతీయ సాహిత్యాలన్నీ కలగలిపి **'భారతీయత'** అనే సమగ్ర స్వరూపాన్ని ఆవిష్కరిస్తాయి. భారతంలో శ్రీకృష్ణుడు గురించి భారతీయులు ఇలా భావిస్తారు.




*ఒక రైతు*
*నాగలితో నేలను చీల్చినప్పుడు*
*ఆ చీలికలోనూ*
*ఒక పద్యం మొలిచింది.*

ఒక తల్లి
పిల్లవాడి కోసం
తలుపు దగ్గర ఎదురు చూసినప్పుడు
ఆ నిరీక్షణలోనూ
ఒక మహాకావ్యం పుట్టింది.?

**ఒక భాష**
**మరో భాషను కలిసినప్పుడు**
**అనేక నదులు**
**ఒకే సముద్రాన్ని చేరినట్లుగా**
**కొత్త పదాలు పుట్టాయి.**
**ఆ సంగమంలోనే**
**భారతీయ సాహిత్యం**
**తన విశాలతను పొందింది.**

**"మరొకరు సందేహంలో నిలిచిన/ మనిషి చెవిలో వినిపించిన సంభాషణ./సందేహంలో గీతగా పలికాడు./ప్రేమలో రాధ తత్వమయ్యాడు./జీవితంలో కర్మకు అర్థమయ్యాడు."**

## సామాజిక, చారిత్రక పరిణామాల అవగాహన :

సాహిత్యం తాను పుట్టిన కాలానికి, సమాజానికి సజీవ దర్పణం లాంటిది. రాజకీయ, సామాజిక పరిణామాలను తెలుసుకోవడానికి చరిత్ర పుస్తకాల కన్నా సాహిత్యమే అత్యంత ప్రామాణికం. సంస్కృత రచనలను తెలుగులోకి తీసుకొని రావడంలో భారతీయ సాహిత్య ఆత్మ ఉంది.

**"బుద్ధుని మౌనం/పదాలకు అందని ఒక కవిత./కబీర్ పలికిన మాట/గుడి గోడలకూ/మసీదు గోడలకూ/అవతల నిలిచిన మనిషి స్వరం./అన్నమయ్య కీర్తనలో భక్తి ఉంది,/వేమన పద్యంలో నిజం ఉంది,/తిరువళ్ళవర్ మాటల్లో జీవితం ఉంది./తెలుగు నేలపై/నన్నయ అక్షరాలకు, తిక్కన ప్రవాహం చేరింది/ఎర్రన చేతుల్లో మహాకథ మరొక శ్వాస తీసుకుంది./మనిషి హృదయం/ప్రేమను తాకినప్పుడు/భక్తి ఎలా/సంగీతమవుతుందో చూపిన/ఒక అనంత తరంగం పోతన పద్యమయ్యింది/శ్రీనాథుని పదంలో భాషకు వైభవం వచ్చింది."**

**'రాజతరంగిణి', 'రాయవాచకం'** వంటివి నాటి రాజకీయ, సైనిక పరిస్థితులను చారిత్రక ఆధారాలతో వివరిస్తే; **గురజాడ 'కన్యాశుల్కం', ఉన్నవ 'మాలపల్లి', మున్షీ ప్రేమ్‌చంద్ 'గోదాన్'** వంటి రచనలు నాటి సామాజిక రుగ్మతలను, అంటరానితనాన్ని, రైతుల దయనీయ స్థితిని కళ్లకు కట్టాయి. అలాగే మధ్యయుగ భక్తి సాహిత్యం కులమత భేదాలపై పోరాడగా, ఆధునిక సాహిత్యం జాతీయోద్యమాన్ని రగిలించింది. ఈ విధంగా, పాలకుల చరిత్రతో పాటు అట్టడుగు వర్గాల పోరాటాలను, సామాజిక మార్పులను రికార్డు చేసిన ఈ సాహిత్య అధ్యయనం ద్వారా మన సమాజం గతం నుండి ఆధునిక దశకు ఎలా పరిణామం చెందిందో మనం సంపూర్ణంగా అవగాహన చేసుకోవచ్చు.

## నైతిక విలువలు, తాత్విక చింతన :

భారతీయ సాహిత్యం ప్రపంచానికి అందించిన అత్యున్నత కానుక నైతిక ప్రబోధం, తాత్విక చింతన. రామాయణ, మహాభారతాలతో పాటు **'భగవద్గీత'** నిష్కామ కర్మను, మానసిక ధృడత్వాన్ని బోధించగా.. **'పంచతంత్రం', 'జాతక కథలు'** జంతు పాత్రల ద్వారా లౌకిక జ్ఞానాన్ని, రాజనీతిని ఆసక్తికరంగా నేర్పుతాయి. కాళిదాసు మహాకవి ప్రకృతి ద్వారా శాశ్వతంగా ముద్రపడే అద్భుతమైన కవిత్వాన్ని అందించాడు.

**"కాళిదాసు/ ప్రకృతికి మనిషి హృదయాన్ని/అద్దంగా ఇచ్చాడు./ మేఘం అతని చేతిలో/విడిపోయిన రెండు హృదయాల మధ్య/ వార్తను మోసే దూతగా మారింది/ ఋతువులు అతని పద్యంలో/ కాలం గడిచే దృశ్యాలేనా/మనిషి హృదయంలో మారే అనుభూతులకు/ప్రకృతి వేసుకున్న ఆరు ముఖాలు."**

అలాగే పండితులకే కాక పామరులకు సైతం జీవిత సత్యాలను ఉద్బోధించడంలో తమిళ **'తిరుక్కురళ్', తెలుగు 'సుమతీ', 'వేమన'** శతకాలు అద్భుతమైన పాత్ర పోషించి, సమాజంలోని మూఢనమ్మకాలను ఎండగట్టాయి. ధర్మం, న్యాయం, కర్మాచరణ వంటి శాశ్వత విలువలను విశ్వజనీనంగా బోధించే ఈ అపురూపమైన సాహిత్య అధ్యయనం.. నేటి యాంత్రిక సమాజంలో మనిషి ఎదుర్కొంటున్న నైతిక పతనానికి, మానసిక ఒత్తిడికి సరైన పరిష్కారాలను చూపుతూ నిత్య మార్గదర్శిగా నిలుస్తుంది.

## సామాజిక చైతన్యం, సంస్కరణల అధ్యయనం:

సాహిత్యం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, సామాజిక రుగ్మతలను పారద్రోలి ప్రజలను మేల్కొల్పే పదునైన ఆయుధంగా ఎలా పనిచేసిందో భారతీయ సాహిత్య చరిత్ర నిరూపిస్తుంది. కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్రము', వంటి రచనలు స్త్రీ సాధికారతకు బాటలు వేస్తూనే అంటరానితనం, భూస్వాముల దోపిడీలను తీవ్రంగా ప్రశ్నించాయి. అలాగే, జాతీయోద్యమ కాలంలో బంకించంద్రుని **'వందేమాతరం'** (ఆనందమఠ్), గురజాడ **'దేశమంటే మనుషులోయ్'**, శ్రీశ్రీ **'మహాప్రస్థానం'**, సుబ్రహ్మణ్య భారతి కవితలు నిద్రాణమైన ప్రజల్లో అఖండమైన దేశభక్తిని, విప్లవ స్ఫూర్తిని రగిలించాయి. సమాజం సంక్షోభంలో ఉన్నప్పుడు జాతికి దిశానిర్దేశం చేసి, మూఢనమ్మకాలపై పోరాటం నుండి స్వాతంత్ర్య కాంక్ష వరకు సామాజిక చైతన్యాన్ని తీసుకురావడంలో సాహిత్యం పోషించిన అసమాన పాత్రను ఈ అధ్యయనం స్పష్టం చేస్తుంది.


**"గురజాడ కవితల్లో/సమాజం తన ముఖాన్ని తానే చూసుకుంది. /శ్రీశ్రీ కవితలో శ్రమే మాట్లాడింది,/కూలీ చేతి చెమటే అక్షరమైంది./ దళితుని గొంతులో/ఎన్నాళ్లుగానో మూగబోయిన/ చరిత్ర కవితగా ఆత్మగౌరవంతో మేల్కొంది./స్త్రీ తన గదిలోంచి/ బయటికి వచ్చినప్పుడు/సాహిత్యం మరో కిటికీ తెరిచింది./ ఆదివాసిఅడవుల్లో/ పుట్టిన పాటలు/భూమి జ్ఞాపకాలను పుష్పించాయి"**

## భాషా పరిణామం, శాస్త్రీయతను అవగాహన :

భారతీయ భాషల పరిణామ క్రమాన్ని, ద్రావిడ, ఇండో-ఆర్యన్ భాషల మధ్య జరిగిన భావ వినిమయాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకోవడానికి సాహిత్యమే ప్రాథమిక ఆధారం. వేల ఏళ్ల క్రితమే మన భాషా నిర్మాణం ఎంత పకడ్బందీగా ఉందో సంస్కృతంలో పాణిని రచించిన **'అష్టాధ్యాయి'**, తమిళంలోని **'తొల్కాప్పియం'** వంటి ప్రాచీన వ్యాకరణ గ్రంథాలు నిరూపిస్తాయి. కాలక్రమంలో మాండలికాలు ప్రామాణిక గ్రంథ భాషలుగా ఎలా మారాయో, ఒక భాష మరో భాషను ఎలా ప్రభావితం చేసిందో కవుల రచనల ద్వారా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు, నన్నయ వాడుక తెలుగుకు సంస్కృత పదాలను జోడించి సుసంపన్నమైన కావ్య భాషగా తీర్చిదిద్దగా; పారశీక, హిందీ భాషల కలయికతో **'ఉర్దూ', 'హిందుస్తానీ'** భాషలు ఎలా పుట్టాయో అమీర్ ఖుస్రో రచనలు స్పష్టం చేస్తాయి. ఈ విధంగా భాషా శాస్త్రీయతను, వాటి మధ్య ఉన్న విడదీయరాని సంబంధాలను సాహిత్య చరిత్ర మనకు స్పష్టంగా వివరిస్తుంది.

## ప్రపంచ వేదికపై భారతీయ గుర్తింపు :

భారతీయ సాహిత్యం ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు తన గొప్ప తాత్విక చింతనతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూ, దేశానికి అత్యుత్తమ సాంస్కృతిక రాయబారిగా (సాఫ్ట్ పవర్) నిలిచింది. పాశ్చాత్య ప్రపంచం మన వేదాంతం, ఇతిహాసాల పట్ల చూపుతున్న ఆసక్తికి చారిత్రక నిదర్శనంగా.. 18వ శతాబ్దంలో సర్ విలియం జోన్స్ అనువదించిన కాళిదాసు **'అభిజ్ఞాన శాకుంతలం'** చదివి జర్మన్ కవి గెథే పరవశించిపోవడం, **రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'**కి నోబెల్ బహుమతి లభించి ఆసియా సాహిత్య గొప్పదనాన్ని ప్రపంచ వేదికపై శిఖరాగ్రాన నిలపడం వంటి ఘట్టాలను పేర్కొనవచ్చు. ఖండాంతరాలలో భారతీయ మేధో సంపత్తిని చాటిచెప్పిన ఈ సాహిత్య విశిష్టతను బట్టి, మన స్వంత సాహిత్యాన్ని మనం సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టమవుతుంది. ఆధునిక యుగంలో ఆర్.కె. నారాయణ్, అరుంధతీ రాయ్, అరవింద్ అడిగ వంటి రచయితలు తమ ఆంగ్ల రచనల ద్వారా భారతీయ సామాజిక వాస్తవాలను, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేస్తూ అంతర్జాతీయ పురస్కారాలు (బుకర్ ప్రైజులు) సాధించడంతో మన సాహిత్య ప్రస్థానం ఖండాంతరాల్లోనూ అప్రతిహతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, భారతీయ సాహిత్యాధ్యయనం అనేది కేవలం భాషాభిమానానికి మాత్రమే పరిమితం కాక, మన గతాన్ని, సంస్కృతిని, బలాబలాలను నిష్పాక్షికంగా అర్థం చేసుకునే **'ఆత్మపరిశీలన'** లాంటిది. గతాన్ని గౌరవిస్తూ, వర్తమాన సామాజిక లోపాలను సవరించుకుంటూ, నైతికంగా ఉన్నతమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికీ, ప్రపంచ పటంలో మనకంటూ ఒక విశిష్టమైన అస్తిత్వాన్ని, గౌరవాన్ని నిలబెట్టుకోవడానికీ నేటి యువతకు ఈ సాహిత్య అధ్యయనం చేయడం ఎంతైనా అవసరం ఉందని గుర్తించాలి.



- డా॥ దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్, ఫోన్: 9989628049

SAHITYA LAHARI
# సాహిత్య లహరి
ఆదివారం 9-08-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**


ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## అణచివేతపై రగిలిన అక్షర సమరం

# గుండెడప్పు

**తెలుగు కవిత్వంలో భిన్నధోరణులు కనిపిస్తున్నాయి. ఒక్కో ధోరణికీ ఒక్కో చారిత్రక సందర్భం కనిపిస్తుంది. సంప్రదాయ ఛందోబద్ధ కవిత్వం నుండి భావకవిత్వం స్వేచ్ఛను, మార్మికతను పరిచయం చేసింది. అది కొన్నాళ్ళకు వ్యక్తిగత అనుభూతుల కేంద్రంగా మారిపోతున్న సమయంలో పీడితుల పక్షాన నిలబడాలని భావిస్తూ అభ్యుదయ కవిత్వం వచ్చింది. అది గొప్ప సామాజిక సంచలనాన్ని తెస్తే, తర్వాత కవిత్వం ఒక షాక్ ట్రీట్మెంట్ లా ప్రజల్ని కదిలించాలని దిగంబర కవిత్వం వచ్చింది. ఆలోచించేలా చేయడం మంచిదే గానీ, నిందించడం ఎక్కువైతే దాన్నిప్రజలు సహృదయంతో స్వీకరించాలంటే నినాదాలు ఇచ్చి ఊరుకోకుండా కవులు కేవలం రాస్తే సరిపోదనీ, కార్యాచరణలోనూ కనిపించాలని విప్లవకవిత్వం ఒక సంచలనాన్ని కలిగించి, కవిత్వానికి సాయుధపోరాటాన్ని చేర్చింది. ఇన్ని భావజాలాలతో కవిత్వం వచ్చినా స్త్రీ వివక్ష, కుల,మత వివక్షల గురించి మాట్లాడకుండా ఉండటమంటే అత్యధికులు పొందుతున్న అవమానాల్ని పట్టించుకోకపోవడమేనని దళిత కవిత్వం కొత్త ఎజెండాతో ముందుకొచ్చింది. దీనికి భారతీయ జీవన వ్యవస్థ ముఖ్యంగా చాతుర్వర్ణ వ్యవస్థ ప్రధాన కారణంగా కనిపిస్తుంది. అందువల్ల మహారాష్ట్రలోని దళిత్ పాంథర్స్ ఉద్యమం ప్రభావంతో భారతదేశంలో దళిత కవిత్వం మొదలైంది. దీన్ని తెలుగు సాహిత్యంలోకి తీసుకొని రావడంలో తెలుగు సమాజాల్లో జరిగిన కారంచేడు, చుండూరు తదితర సంఘటలను కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో అప్పటికే భారతరాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ల వల్ల విశ్వవిద్యాలయ స్థాయిలో మేధావి వర్గం తయారయ్యింది. అలా ఒక మేధావి వర్గమే హైదరాబాదు సెంట్రల్ యూనివర్సటీ దళిత విద్యార్థులు. సమకాలీన సమాజాన్ని, సాహిత్య స్థితి గతులను గుర్తించి ఒక గొప్ప సాహిత్యానికి నాంది పలికుతూ వచ్చిందే 'గుండె డప్పు' కవితా సంకలనం. అంబేద్కర్ అసోసియేషన్ వారి సాహిత్య అనుబంధ సంస్థ దళిత సాహిత్య వేదిక ద్వారా దీన్ని తీసుకొచ్చారు.**




**"గుండెడప్పు" అనేది శతాబ్దాల అణచివేతపై దళిత సమాజం వెలువరించిన ఒక శక్తివంతమైన తిరుగుబాటు ధ్వని. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన 'దళిత సాహిత్య వేదిక' ప్రచురించిన ఈ కవితా సంకలానికి పట్టేటి రాజశేఖర్, నాగప్పగారి సుందర్రాజు సంపాదకత్వం వహించారు. "కులనిర్మూలన ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యం" అనే అంబేద్కర్ తాత్విక భూమిక ఆధారంగా ఈ పుస్తకం రూపుదిద్దుకుంది. తరతరాలుగా సాగుతున్న అంటరానితనం, సామాజిక అన్యాయాలు, విశ్వవిద్యాలయాల్లో సైతం రూపాంతరం చెంది వేధిస్తున్న కుల వివక్షపై ఈ సంకలనంలోని ప్రతీ కవితా ఒక ప్రశ్నై నిలదీస్తుంది. దళితుల రక్తాన్నీ, శ్రమనూ దోచుకుంటూ వారిపై జరిగే భౌతిక దాడులను కవులు తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా సమాజంలోనూ, కుటుంబంలోనూ త్రివిధ పీడనకు గురవుతున్న దళిత స్త్రీల వేదనను, వారి నిశ్శబ్ద ఆక్రోశాన్ని ఈ కవిత్వం అత్యంత సహజంగా, భావోద్వేగభరితంగా ఆవిష్కరించింది. అన్యాయాన్ని మౌనంగా భరించడం కాకుండా, ఆత్మగౌరవంతో తిరగబడి తమ చరిత్రను తామే తిరగరాయాలని ఈ అక్షరాలు పిలుపునిస్తాయి. సమ సమాజ స్వప్నం కోసం ప్రాణాలర్పించిన అమరులకు అంకితమిచ్చిన ఈ 'గుండెడప్పు', విద్యార్థి లోకపు సామాజిక చైతన్యానికి, దళిత ఆత్మగౌరవ పోరాటానికి ఒక నిలువెత్తు ప్రతిరూపం.**

ప్రముఖ రచయిత సాహిత్య విమర్శకులు జి. లక్ష్మినరసయ్య గుండెడప్పు కవితా సంకలనంలోని ముందుమాటలో ఇలా అన్నారు. ఈ కవితల్లో నిజాయితీ, ధిక్కారం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. దళిత కవిత్వాన్ని అణగదొక్కాలని చూసేవారి తాటాకుల గలగలలను ఈ కవులు ఖాతరు చేయరని, ఆధునిక దళిత కవిత్వ చరిత్రలో దీనికి తగిన స్థానం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సంకలనంలోని నిప్పుల మీద నడక అనే ముందుమాటలో దళిత సమాజం యొక్క ఆత్మగౌరవ పోరాటాన్ని, దళిత కవిత్వానికి మూలాధారం ఆత్మగౌరవమేనని, సమాజంలో గౌరవంగా జీవించడం కోసం దళితులు తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని ఈ భాగం స్పష్టం చేస్తోంది. వారిపై జరిగే అణచివేతను భరిస్తూ ఊరుకోకుండా, ప్రతి దెబ్బకూ మరింత ధైర్యంగా తల ఎత్తి నిలబడటమే వారి నైజం. నిత్యం ఎదురయ్యే అన్యాయాలు, వివక్షల వల్ల చావే వారి బతుకులో ఒక భాగమైపోయింది. అందుకే కిషోర్

**"అసలు చావు గురించే ఎందుకు మాట్లాడాలి? చావే బతుకయింది కాబట్టి"** అంటూ ఈ చేదు నిజానికే అద్దం పడతారు. అయితే, ఈ చావు వారికి ముగింపు కాదు; మట్టిలో పడిన విత్తనం కొత్త చెట్టుగా మారినట్లుగా, ఒకరి త్యాగం వేలాది మందిలో పోరాట చైతన్యాన్ని రగిలిస్తుంది. "జీసస్సుల్లోంచి ఉషస్సులు లేస్తాయి" అన్నట్లుగా, ఎంతగా అణచివేస్తే అంత శక్తివంతంగా తిరిగి లేచే ఆత్మవిశ్వాసం వారిది.

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు రచించిన **"ఒక మాదిగ స్మృతి నాగప్ప గారి సుందర్ రాజు పరిచయం (2007)" గ్రంథంలో గుండె డప్పు కవితా సంకలనం గురించి పూర్తి వివరాలు ఇస్తూ దాని పునర్ముద్రణ కు జరిగిన ప్రయత్నాలను కూడా ఇలా పేర్కొన్నారు. "దీన్ని 1995 ఆగస్టులో ప్రచురించారు. దీనికి పట్టేటి రాజశేఖర్, నాగప్పగారి సుందర్ రాజు సంపాదకులుగా వ్యవహరించారు. దీన్ని దళిత సాహిత్య వేదిక, డా.అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. దీనికి జి.లక్ష్మి నరసయ్య, సతీష్ చందర్ లు ముందుమాటలు రాశారు. వీటితో పాటు వెనుక కవర్ పేజ్‌పై శివసాగర్, డా. ఎస్వీ, కత్తి పద్మారావుల అభిప్రాయా లను ప్రచురించారు. దీన్ని సమసమాజ స్థాపనకై అసువులు బాసిన దళిత వీరులకు అంకితం చేశారు. 20 కవితలు ఉన్నాయి. వీటిలో గుండెడప్పు పేరుతో కోయి కోటేశ్వరరావు ఒక కవిత రాశాడు. కనకయ్య రాసిన కవిత పేరు "నా రోడ్డు మీద … దీనిలో ఎక్కడా గుండెడప్పు అనే మాట కూడా రాలేదు. ఇక, ప్రధాన సంపాదకులలో పట్టేటి రాజశేఖర్ కవిత లేదు. నాగప్పగారి సుందర్ రాజు రాసిన కవితలు మాత్రం మూడు ఉన్నాయి. ఈ పుస్తకాలకు సం ప్రదించ వలసిన చిరునామా మాత్రం జి.వి. రత్నాకర్ ది ఉంది. నాగప్పగారి సుందర్రాజు తన లేఖలో చెప్పుకున్నట్లు లక్ష్మీ ఫైన్ ఆర్ట్స్ ప్రింటర్స్, ఖైరతాబాదు అనే ఉంది.**

**గుండెడప్పు పునర్ముద్రణ వివాదం:**

**విద్యార్థులు రాసిన కవితలను సేకరించి డా. అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వా ళ్ళు గుండెడప్పు పేరుతో ఒక కవితా సంకలనాన్ని ప్రచురించారు. గుండెడప్పు కవితాసంకలనాన్ని తరువాత ఒక వ్యక్తి ప్రచురించుకొని, రాజకీయవేత్తలకు అంకితమివ్వాలనీ, దాన్ని తన వ్యక్తి గత ప్రయోజనాలకు వినియోగించుకోవాలనీ తీవ్రంగా ప్రయత్నించాడు. ఆ విషయంలో సుందర్రాజు మనస్తాపానికి గురయ్యాడు."**

అని పేర్కొన్నారు. **'మంకెనపూవు', 'మట్టి చేతులు'** కవితలలో చల్లపల్లి స్వరూపరాణి గారు దళిత స్త్రీలు ఎదుర్కొంటున్న కులం, వర్గం, పురుషాహంకారం అనే మూడు రకాల పీడనలను కళ్లకు కట్టినట్లు చూపించాయి.

"ఇంట్లో.. పురుషాహంకారం
ఒక చెంప ఛెళ్ళుమనిపిస్తే
వీధిలో కులాధిపత్యం
రెండో చెంప పగలగొడుతుంది."

ఇంట్లో పురుషాహంకారం, వీధిలో కులాధిపత్యం వారిని తీవ్రంగా వేధిస్తాయి. ఉద్యోగాల్లో రిజర్వేషన్ల పై జరిగే హేళనలు, హాస్టళ్లలో వార్డెన్ల చెడు చూపులు వంటి చేదు నిజాలను ఈ కవితలు ధైర్యంగా రికార్డు చేశాయి.

"'రిజర్వేషన్ కేటగిరి' అనే గుసగుసల్ని వినలేక/
నాకే, నాచెవుల్లో పీసం పోసుకోవాలనిపించింది./సహనం
చచ్చిపోయినపుడు/గడ్డిపోచకూడా దబ్బనమై
గుచ్చుకుంటుంది./ఇకనాకు పరుగెత్తే ఓర్పులేదు./ఈ కష్టాల
మంటల్లోనే బతుకుని కడుక్కొని /'మంకెనపూవు' లా
విచ్చుకుంటాను /అగచాట్ల అడవుల్ని దాటి/
సెలయేరులా దూకుతాను".

అంటూ సమాజంలో ఎదురయ్యే వివక్ష, అవమానాల వల్ల తీవ్రమైన ఆవేదన కలుగుతుంది. ఆ ఆవేదన నుంచే గొప్ప ఆత్మవిశ్వాసం పుడుతుంది. కవి ఈ విషయాన్ని ఎంతో శక్తి వంతంగా రచయిత్రి మనకు తెలుపుతుంది. విద్యా, ఉద్యోగ రంగాల్లో 'రిజర్వేషన్ కేటగిరి' అని ఇతరులు గుసగుసలాడుతున్నారు. వారు చేసే వెటకారాలు, తక్కువ చూపు మాటలు వినలేక చెవుల్లో కరిగించిన సీసం పోసుకోవాలనేంత వేదనను వ్యక్తం చేస్తుంది అయితే, ఈ అవమానాలను నిశ్శబ్దంగా భరించే ఓర్పు ఇప్పుడు నశించింది. సహనం చచ్చిపోయినప్పుడు గడ్డిపోచ కూడా దబ్బనమై గుచ్చుకుంటుందని ఇక తనకు పరుగెత్తే ఓర్పు లేదని, ఈ అన్యాయాలను ఇక ఎంతమాత్రమూ సహించలేమని కవి స్పష్టం చేశారు కవయిత్రి.

'గుండెడప్పు' కవితలో కోయి కోటేశ్వరరావు మీడియా, సమాజంలోని లూచ్ఛా మేధావుల కుట్రలను, దళితుల ప్రతిభను తక్కువ అంచనా వేసే 'విషరాతల'ను ఈ కింది కవితలో ఇలా ఖండించారు.

"కులగజ్జితో కుళ్ళు కంపుకొడుతున్న .
జీవచ్ఛవాలకు, విశ్వాన్ని వెలిగించే నేను
'వెధవ ' లాగానే కనపడతాను..
తిన్నదరక్క ఏడ్చే సోమరిపోతులకు
కష్టపడినా కడుపునిండని నా సంతతి
'ఈగల్లా' 'దోమాల్లా' గానే కనబడతారు..
చదువు 'కొని' అందల మెక్కి శాసించే
పందికొక్కులకు
ప్రగతికి ఊపిరి పోసే నేను
ప్రతిభలేని 'పరాన్నభుక్కు' గానే
కనబడతాను" అని అంటాడు. కవి కుల అహంకారంతో కుళ్ళిపోయిన సమాజానికి, ఈ ప్రపంచాన్ని తన శ్రమతో వెలిగించే మనిషి ఒక తక్కువవాడిలాగానే కనిపిస్తాడంటారు కవి. ఏ కష్టమూ తెలియక సోమరిగా బ్రతికేవారికి, రేయింబవళ్లు కష్టపడినా కడుపు నిండని శ్రామిక ప్రజలు 'ఈగలు', 'దోమలు' లాగా చులకనగా కనబడతారని అవేదన చెందుతాడు. డబ్బుతో చదువును కొనుక్కుని ఉన్నత పదవుల్లో కూర్చునేవారు, సమాజ పురోగతికి అసలైన ఊపిరి పోసే వర్గాలను 'ప్రతిభ లేని పరాన్నజీవులు' అని నిందిస్తారు. ఈ విధంగా కవి సమాజంలో ఉన్న కుల వివక్షను, శ్రమదోపిడీని, ప్రతిభ పేరుతో జరిగే మోసాన్ని తన కలంతో ప్రశ్నించాడు.

జి.వి. రత్నాకర్ గారు 'అమ్మ కడుపులో' కవితలో అంటరాని తనం గురించి ఇలా అంటారు.

"మీ ఆలోచనలకు దూరంగా,
ప్రశ్నలాయుధాలు అందనీకుండా
బావిలో కప్పను చేశారు.
కాటి కాపరిగా, చర్మకారునిగా,
ఊరినుంచే దూరంచేయబడ్డాను,
వెలికీ, చలికీ బలియై, ఇప్పుడు
పులిలాగే మారేను,
మీ అంతర్ముఖ కుట్రను తెలుసుకొని
ఓ చేత్తో ఆరె, మరో చేత్తో బరిసెతో
మీ అంతు చూచేందుకు, అదను చూసి
కదిలిన నన్ను / నిలువుగా చీల్చేశారు".



అంటారు దళితులకు ఉన్నతమైన ఆలోచనలకు, హక్కుల ప్రశ్నలకు దూరంగా ఉంచుతూ సమాజం నన్ను బావిలో కప్పలా మార్చేసింది. కాటి కాపరిగా, చర్మకారునిగా ఊరికి దూరంగా నెట్టివేస్తూ వెలివేతకు, చలికి బలి చేశారు. అయితే మీ అంతర్లీనమైన కుట్రలను అర్థం చేసుకున్న నేను, ఆ అణచివేతను నిరసిస్తూ ఇప్పుడు పులిలా తిరగబడ్డాను. అయిన సమాజం నన్ను నిలువుగా చీల్చివేసిందని ఈ విధంగా కవి తరతరాలుగా జరుగుతున్న సామాజిక వెలివేతను, దానికి ఎదురుతిరిగిన శ్రామిక/ దళిత వర్గాలపై జరిగిన దౌర్జన్యాన్ని అత్యంత ఆవేదన, ఆక్రోశంతో ఆవిష్కరించారు.

సమాజం శ్రామిక వర్గం ఎన్ని రకాల అవమానాలకు గురి అవుతుందో ఎన్ రవికుమార్, కే శ్రీనివాసరావు రాసిన 'సాయుధ మవుతున్న వాణ్ణి' కవితలో మనం చూడవచ్చు

"గుడికి, బడికి మమ్మల్ని బహిష్కృతుల్ని చేస్తే
శ్రమ ఉలితో నాగరికతా శిల్పాన్ని చెక్కిన వాళ్లం
దాన్ని హైజాక్ చేసి నువ్వు ప్రతిభావంతుడివైతే
దోచుకోవడం తప్ప అన్ని వృత్తులను
ప్రాణంలా పెంచుకున్న వాళ్లమై"

సమాజం తమను గుడులకు, బడులకు దూరంగా ఉంచి బహిష్కరించినప్పటికీ, బహుజన శ్రామికులు తమ శ్రమ అనే ఉలితోనే ఈ మానవ నాగరికతా శిల్పాన్ని చెక్కారు. అయితే ఆ శ్రమను దోచుకున్న ఉన్నత వర్గాలు తామే పెద్ద 'ప్రతిభావంతులం' అని ప్రకటించుకున్నాయి. శ్రామికులు ఇతరులను దోచుకోవడం తప్ప సమాజానికి ఉపయోగపడే సమస్త వృత్తులను ప్రాణంగా భావించి పనిచేశారు. మండల్ కమిషన్ ద్వారా లభించిన హక్కులతో తాత్కాలిక ఉపశమనం పొందాలని తపించినప్పటికీ, సమాజం ప్రతిరోజూ ఏదో ఒక శ్రామిక వృత్తిని అవమానించడాన్ని ఒక అలవాటుగా మార్చుకుంది. మాదిగల చెప్పులు, మాలల వ్యవసాయ శ్రమ, కుమ్మరుల కుండలు, సాలీల వస్త్రాలు… ఈ వృత్తులన్నీ కలిసి సమాజానికి ఒక నాగరిక అస్తిత్వాన్ని ఇచ్చాయి. ఇతరులు నాటకీయంగా ఉపన్యాసాలు చెప్పే 'అహింసో పరమ ధర్మః' అనే సూత్రాన్ని, ఎన్ని అవమానాలు ఎదురైనా నిజాయితీగా తమ జీవితాల్లో ఆచరించి చూపించింది ఈ శ్రామిక ప్రజలేనని కవి స్పష్టం చేశారు.

'వర్తమాన దృశ్యం' కవితలో కత్తుల కిషోర్ మరోసారి జీసస్ సిలువ వేయబడ్డాడని చెప్పడంలో శ్రమ జీవులు, అమాయకులు నిత్యం బలికావడాన్ని సూచించారు.

"ఏ చావుని గూర్చి మాట్లాడాలి
అసలు చావు గురించే ఎందుకు మాట్లాడాలి?
చావే బతుకు అయింది కాబట్టి నిత్యం
అనే'కుల' మరణాలు..
జీసస్ కు మరణించడమేకాదు /తిరిగి లేవడమూ తెలుసు
జీసస్ కరుణామయుడే కాదు,/
'సాతాను' ను శాసించే /చూపుడు వేలు కూడా…"

వర్తమాన సమాజంలో నిత్యం జరుగుతున్న అన్యాయాలు, దౌర్జన్యాల వల్ల అమాయకుల చావే వారికి బతుకుగా మారిపోయిందని, ముఖ్యంగా అణగారిన వర్గాల నిరంతర మరణాలను (అనే'కుల' మరణాలు) కవి అత్యంత వేదనతో ప్రశ్నిస్తున్నారు. అయితే, అణచివేసే దుర్మార్గ శక్తులను హెచ్చరిస్తూ జీసస్ కేవలం మౌనంగా సిలువపై మరణించడమే కాదు, తిరిగి పునరుత్థానమై లేవడం కూడా తెలుసని స్పష్టం చేశారు. ఆయన కేవలం క్షమించే కరుణామయుడు మాత్రమే కాదని, సమాజంలోని చెడును, 'సాతాను' లాంటి దుష్టశక్తులను తీవ్రంగా నిలదీసి శాసించే ఆవేశం, చైతన్యం కూడా అని కవి ఈ పంక్తులలో హెచ్చరించారు.


"తారుడబ్బాల వీడమాటున చిన్నతమ్ముణ్ణి పండబెట్టి
రోడ్డుపని చేసే మా అమ్మానాన్నల్ని చూస్తే బహుశా మీరు భళ్ళున
వాంతి చేసుకుంటారనుకుంటాను…
రోడ్డు వేయడం తప్ప దాని మీద సన్నగా నడవలేని వాళ్ళం
అందుకే నేనింక రోడ్డు వెయ్యదల్చుకోలేదు, రోడ్డుని బ్లాస్ట్
చెయ్యదల్చుకున్నాను."

చీకటి బతుకుల్లో జీవించే తమకు సిద్ధాంతాల వెలుగులు చూపించాలనుకునే మేధావులను ప్రశ్నిస్తూ, కవి కనకయ్య శ్రామిక వర్గం యొక్క వాస్తవిక వేదనను ఇక్కడ కళ్లకు కట్టారు. కనీస సదుపాయాలు లేక తారుడబ్బాల చాటున చిన్నపిల్లలను పండబెట్టి రోడ్లు వేసే అమ్మానాన్నల కష్టాన్ని సమాజం అసహ్యించు కుంటుందే తప్ప వారి శ్రమను గుర్తించదని ఆవేదన చెందారు. ఆ రోడ్లపై వంక జుట్టు ఉన్న ధనికులు బుద్ధ కార్లలో వేగంగా వెళ్లిపోతారు కానీ, ఆ రోడ్డును నిర్మించిన శ్రామికులకు మాత్రం దానిపై నడిచే హక్కు కూడా దక్కదు. గంజి పోసినా అది గరళంగా మారి ప్రాణాలు తోడేలా చేసే ఈ అన్యాయమైన వ్యవస్థకు రూపకమైన 'రోడ్డు'ను ఇకపై వేయడం కాదని, ఆ వివక్షతో కూడిన రోడ్డునే పేల్చివేయాలని (బ్లాస్ట్ చేయాలని) కవి క్రాంతివంతమైన తిరుగుబాటును ప్రకటించారు.

"నేనూ… మాతమ్ముడూ/ తూరుపు కొండకు నిచ్చెనవేసి/ తొలి పొద్దును వెలిగిస్తుంటే / నేలమీద నిలబడ్డ వాడు/ నిచ్చెన మెట్లను నిశ్శబ్దంగా /నరకాలని చూస్తాడు/ నేనూ… మా పెద్దోడు /నింగి చెట్టు కొమ్మవంచి/ చుక్కల పూలు కోస్తూంటే /నివ్వెర పోయిన వాడు…/ అరచేతిలో చందమామ చూపించి /మా ఇద్దరికీ మధ్య ఇనుపగోడలు కడతాడు"

ఈ కవితలో ఆదిపత్య వర్ణాల వారు కింది వర్ణాల వారిని కలవకుండగా చేసి వారిలో చైతన్యాన్ని అణగద్రొక్కే కుట్రలను కవి కళాత్మకంగా వర్ణించాడు. 'గుండెడప్పు' కవితా సంకలనం శతాబ్దాల మౌనాన్ని బద్దలు కొడుతూ రగిలిన అక్షర సమరం. అది తెలుగు సాహిత్యంలో ఆత్మగౌరవ పోరాటానికి, సాంస్కృతిక తిరుగుబాటుకు ఒక గొప్ప గుర్తుగా నిలిచింది. తరతరాలుగా జరుగుతున్న అణచివేతను, విశ్వవిద్యాలయాల్లోని కుల వివక్షను ఈ కవిత్వం ధైర్యంగా ప్రశ్నించింది. బహుజనుల శ్రమే నాగరికతకు పునాది అని, వారి కష్టమే నిజమైన 'ప్రతిభ' అని సగర్వంగా చాటిచెప్పింది. పురాణ పాత్రలకు కొత్త అర్థాలు ఇవ్వడం, దళిత స్త్రీలు ఎదుర్కొంటున్న మూడు రకాల పీడనలను చూపించడం, కుల-వర్గ పోరాటాల ఐక్యతను కోరుకోవడం ఇందులో ముఖ్యమైన అంశాలు. ప్రచురణ, పునర్ముద్రణ పరంగా కొన్ని వివాదాలు వచ్చినప్పటికీ, ఈ పుస్తకం అందించిన చైతన్యం, తాత్వికత ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. ప్రముఖ విమర్శకులు లక్ష్మీనరసయ్య గారు చెప్పినట్లుగా, దళిత కవిత్వ చరిత్రలో 'గుండెడప్పు'కి ఒక చెరిగిపోని స్థానం ఉంది. ఇది కేవలం బాధలను చెప్పుకోవడంతో ఆగిపోలేదు; బహుజన ఐక్యతను, రాజ్యాధికార సాధనను, అంబేద్కర్ ఆశయాలను ఎలుగెత్తి చాటిన ఒక విప్లవ గొంతుకగా నిలిచింది.

**'గుండెడప్పు' కవితా సంకలనం తరతరాల పీడన, అణచివేతలపై దళిత సమాజం పూరించిన ఆత్మగౌరవ శంఖారావం పూరించిన తొలి స్వరం. డా. బీ.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో రగిలిన ఈ అక్షర సమరం, కుల నిర్మూలన, సమసమాజ స్థాపన దిశగా ఆధిపత్య మూస భావజాలాలను బద్దలుకొట్టింది. తెలుగు సాహిత్య చరిత్రలో దళిత కవిత్వానికి ఒక నిర్దిష్టమైన, శక్తివంతమైన దిశానిర్దేశం చేసిన ఈ అక్షరాయుధం, సామాజిక న్యాయం, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, బహుజన రాజ్యాధికారం కోసం పోరాడే రాబోయే తరాలకు ఎప్పటికీ ఒక సజీవ చైతన్య దీపికగా, నిరంతర స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.**



# సాహిత్య లహరి
SAHITYA LAHARI

ఆదివారం 9-08-2026


**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No: 6305584064

# యశోదారెడ్డి సాహిత్య సుగంధం

**తెలంగాణ సాహిత్యానికి చిరస్థాయి వెలుగునిచ్చిన మహోన్నత రచయిత్రికి రాష్ట్రస్థాయి సాహిత్య నివాళి**

***తెలంగాణ సాహిత్య చరిత్రలో కొన్ని పేర్లు కేవలం రచయితల పేర్లుగా మిగిలిపోవు. అవి ఒక ప్రాంతపు భాషకు, సంస్కృతికి, సామాజిక జీవనానికి, అస్తిత్వానికి ప్రతీకలుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన సాహితీమూర్తుల్లో ఆచార్య పాకాల యశోదారెడ్డి ఒకరు. తెలంగాణ భాష, పల్లె జీవితం, జానపద సంస్కృతి, మహిళా అనుభవాలు, సామాజిక విలువలను తన రచనల్లో సహజంగా ప్రతిబింబించిన ఆమె సాహిత్యం ఒక కాలానికి చెందిన సాహిత్యంగా మాత్రమే కాకుండా తెలంగాణ సామాజిక-సాంస్కృతిక చరిత్రకు సజీవ దస్తావేజుగా నిలిచింది.***

ఆమె 97వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో, మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ-పాలమూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఆచార్య పాకాల యశోదారెడ్డి సమగ్ర సాహిత్యం" రాష్ట్రస్థాయి సదస్సు ఈ నేపథ్యంలో విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఇది కేవలం జయంతి సభ కాదు; యశోదారెడ్డి సాహిత్యాన్ని సమగ్రంగా పునఃపరిశీలించి, కొత్త తరానికి పరిచయం చేసి, భవిష్యత్ పరిశోధనలకు మార్గం చూపించే అకాడమిక్ వేదిక. ఈ సందర్భంగా ఆమె రచించిన "కథాచరిత్ర" గ్రంథం పునర్ముద్రణ కూడా జరగడం సదస్సుకు మరింత పరిశోధనాత్మక విలువను చేకూరుస్తోంది. ఈ మహత్తర సదస్సుకు శ్రీమతి రావూరి వనజ సంచాలకురాలిగా, శ్రీమతి జి. శాంతారెడ్డి, డా. భారతి సహా సంచాలకులుగా, శ్రీమతి చుక్కాయిపల్లి శ్రీదేవి, శ్రీమతి మేకల అనూరాధ గౌరవ సంచాలకులుగా, డా. ఇడికోజు శ్రీనివాసాచారి సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సాహితీవేత్తలు, ఆచార్యులు, పరిశోధకులు, రచయితలు, కవులను ఒకే వేదికపైకి తీసుకురావడంలో నిర్వాహకుల కృషి అభినందనీయం.

యశోదారెడ్డి సాహిత్యానికి ప్రధానమైన ప్రత్యేకత తెలంగాణ భాషకు ఆమె కల్పించిన సాహిత్య గౌరవం. ఒక ప్రాంతపు మాండలికం కేవలం సంభాషణా సాధనం కాదు; అది ఆ ప్రాంత ప్రజల చరిత్ర, సంస్కృతి, జీవనానుభవం, భావజాలానికి ప్రతిరూపం. ఈ విషయాన్ని యశోదారెడ్డి తన రచనల ద్వారా నిరూపించారు. ఆమె కథల్లో తెలంగాణ పలుకుబడి కృత్రిమంగా చేర్చిన అంశంలా కాకుండా పాత్రల సహజ జీవితంలో భాగంగా కనిపిస్తుంది. పల్లె మనుషుల మాటలు, నుడికారాలు, స్థానిక పదజాలం, భావవ్యక్తీకరణ కలిసి తెలంగాణ భాషకు ఒక ప్రత్యేక సాహిత్య స్వరూపాన్ని అందించాయి. భాషను సాహిత్యంలో నిలబెట్టడం ద్వారా ఆమె ఒక తరానికి చెందిన జీవనానుభవాలను కూడా భద్రపరిచారు.

ఆమె కథా సాహిత్యంలో పల్లె జీవితం ప్రధానమైన నేపథ్యంగా కనిపిస్తుంది. కుటుంబ సంబంధాలు, బంధుత్వాలు, ఆర్థిక ఇబ్బందులు, సంప్రదాయాలు, సామాజిక విలువలు, మారుతున్న జీవన విధానాలు, మహిళల అనుభవాలు వంటి అంశాలు ఆమె కథల్లో సహజంగా మిళితమై ఉంటాయి. ఆమె పాత్రలు కల్పిత ప్రపంచానికి చెందినవిగా కాకుండా మన చుట్టూ కనిపించే మనుషుల్లా అనిపిస్తాయి. అందుకే ఆమె కథలు తెలంగాణ గ్రామీణ జీవితానికి అద్దంగా నిలుస్తాయి. ఒక నిర్దిష్ట కాలంలో సమాజం ఎలా ఉండేది, కుటుంబ సంబంధాలు ఎలా ఉండేవి, ప్రజల జీవన విలువలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడానికి కూడా ఆమె రచనలు ఉపయోగపడే సాహిత్య ఆధారాలుగా నిలుస్తాయి.

యశోదారెడ్డి సాహిత్యంలో మహిళా జీవితం మరో ముఖ్యమైన అంశం. ఆమె రచనల్లో స్త్రీ కేవలం బాధితురాలు కాదు; కుటుంబాన్ని నిలబెట్టే శక్తి, ఆత్మగౌరవం కలిగిన వ్యక్తి, నిర్ణయం తీసుకునే మనిషి, సామాజిక మార్పులను ఎదుర్కొనే చైతన్యవంతురాలు. ఆమె స్త్రీ చైతన్యం నినాదాల రూపంలో కాకుండా జీవన వాస్తవాల నుంచి వ్యక్తమవుతుంది. తెలంగాణ గ్రామీణ మహిళా జీవితంలోని అంతరంగ సంఘర్షణలను, బాధ్యతలను, ఆత్మగౌరవాన్ని మానవీయంగా చిత్రించిన రచయిత్రిగా ఆమెకు ప్రత్యేక స్థానం ఉంది. అందువల్ల ఆమె రచనలు మహిళా అధ్యయనాల దృష్టితో కూడా పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది.

జానపదం కూడా యశోదారెడ్డి సాహిత్యంలో అంతర్భాగం. జానపదం అంటే కేవలం పాటలు, సామెతలు, కథలు, ఆచారాలు కాదని, అది ప్రజల జీవన తత్వమని ఆమె రచనలు తెలియజేస్తాయి. పండుగలు, సంప్రదాయాలు, స్థానిక విశ్వాసాలు, కుటుంబ సంస్కారం, గ్రామీణ జీవన విధానాలు వంటి అంశాలు ఆమె రచనల్లో సహజంగా మిళితమై ఉంటాయి. ప్రపంచీకరణ, పట్టణీకరణ ప్రభావంతో గ్రామీణ సంస్కృతి వేగంగా మారుతున్న సమయంలో ఆమె రచనలకు మరింత ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఒక కాలానికి చెందిన జానపద జీవనాన్ని సాహిత్యంలో భద్రపరిచిన రచయిత్రిగా ఆమె కృషి విలువైనది.

సృజనాత్మక రచయిత్రిగానే కాకుండా యశోదారెడ్డి పరిశోధకురాలిగా కూడా విశిష్ట సేవ చేశారు. ముఖ్యంగా "కథాచరిత్ర" తెలుగు కథా సాహిత్య అధ్యయనంలో ప్రాధాన్యమైన గ్రంథంగా నిలిచింది. కథా సాహిత్య వికాసాన్ని చారిత్రక, విమర్శనాత్మక దృష్టితో పరిశీలించే ఈ గ్రంథం పునర్ముద్రణ పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. పాత పరిశోధనను కొత్త తరానికి అందించడం ద్వారా వర్తమాన పరిశోధనకు కొత్త పునాదులు ఏర్పడతాయి. యశోదారెడ్డి సాహిత్యంలో తెలంగాణ అస్తిత్వం కూడా సహజంగా ప్రతిఫలించింది. ఆమె తెలంగాణను కేవలం నినాదంగా రాయలేదు; తెలంగాణను జీవనంగా చిత్రించారు. భాష, మట్టి, పల్లె, జానపదం, ప్రజల జీవన విధానం, స్థానిక సంస్కృతి ఆమె రచనల్లో అంతర్భాగా లుగా కనిపిస్తాయి. అందువల్ల ఆమె సాహి త్యాన్ని తెలంగాణ అస్తిత్వ చైతన్యానికి సంబం ధించిన సాహిత్యంగా కూడా అధ్యయనం చేయవచ్చు.

ఈ సదస్సు సాధారణ స్మారక సభలకు భిన్నంగా అకాడమిక్ చర్చలకు ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. యశోదారెడ్డి కథలు, కవిత్వం, భాష, జానపదం, మహిళా చైతన్యం, తెలంగాణ అస్తిత్వం, పరిశోధన, రచనా దర్శనం వంటి విభిన్న అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పించనున్నారు. పత్రాల వ్యక్తిగత విశ్లేషణ కంటే వాటి సమగ్రతను పరిశీలిస్తే యశోదారెడ్డి సాహిత్యాన్ని బహుముఖ దృష్టితో అధ్యయనం చేయాలనే సదస్సు లక్ష్యం స్పష్టమవుతుంది.

మొదటి రోజు కార్యక్రమాల్లో ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి, పాకాల లక్ష్మీరెడ్డి, డా. పొద్దుటూరి ఎల్లారెడ్డి, చుక్కాయిపల్లి జయలక్ష్మమ్మ, డా. గంజి శ్రీనివాసాచారి, ఆచార్య వంగరి త్రివేణి, డా. చందోజి రావు, డా. నలవోలు నరసింహారెడ్డి తదితరులు పాల్గొనడం, రెండవ రోజు డా. నామోజు బాలాచారి, ఆచార్య పులికొండ సుబ్బాచారి, ఆచార్య మసన చెన్నప్ప, ఆచార్య పిల్లలమర్రి రాములు, డా. నాళేశ్వరం శంకరం, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, డా. చవ్వా వెంకటరెడ్డి, డా. మన్నెమోని కృష్ణయ్య, డా. మక్కపాటి మంగళ, డా. నెమ్మికంటి, సంధ్యారాణి, బడే సాబ్, డా. వి. జయప్రకాశ్ వంటి సాహితీవేత్తల భాగస్వామ్యం సదస్సుకు విశిష్టతను చేకూరుస్తోంది.

సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆచార్య పాకాల యశోదారెడ్డి సాహితీ పురస్కారం-2026 ను ప్రముఖ నవలా రచయిత్రి శ్రీమతి పోల్కంపల్లి శాంతాదేవికి, ప్రజాకవి కాళోజీ సాహితీ పురస్కారం-2026 ను డా. కొండపల్లి నీహారిణికి అందజేయడం మరో ప్రత్యేకత. ఒక మహోన్నత రచయిత్రి పేరుతో మరో సాహితీవేత్తను సత్కరించడం ద్వారా సాహిత్య వారసత్వాన్ని కొనసాగించే విలువైన ప్రయత్నం జరుగుతోంది.

అయితే ఈ సదస్సు ప్రభావం రెండు రోజులకే పరిమితం కాకూడదు. సమర్పించిన పరిశోధనా పత్రాలను శాస్త్రీయ సంపాదకత్వం తో గ్రంథరూపంలో ప్రచురించాలి. యశోదారెడ్డి రచనలు, పరిశోధనలు, విమర్శా వ్యాసాలు, ఇంటర్వ్యూలు, ఇతర సమాచారంతో డిజిటల్ ఆర్కైవ్ ఏర్పాటు చేయాలి. ఆమె రచనలు ఇతర భారతీయ భాషల్లోకి, ముఖ్యంగా ఆంగ్లంలోకి అనువదించాలి. విశ్వవిద్యాలయాల్లో ఆమె సాహిత్యంపై మరిన్ని ఎం.ఫిల్., పీహెచ్.డి. పరిశోధనలు జరగాలి.

ఆచార్య పాకాల యశోదారెడ్డి సాహిత్యం తెలంగాణ నేల గుండెచప్పుడు. ఆమె



భాష తెలంగాణ ప్రజల పలుకుబడి. ఆమె కథలు పల్లె జీవన దర్పణం. ఆమె జానపద దృష్టి ఒక సంస్కృతికి అక్షర భద్రత. ఆమె మహిళా పాత్రలు స్త్రీ జీవితానికి మానవీయ వ్యాఖ్యానం. ఆమె పరిశోధన తెలుగు సాహిత్య అధ్యయనానికి దిక్సూచి. అందుకే ఆమెను స్మరించడం అంటే కేవలం జయంతి నిర్వహించడం కాదు; ఆమె సాహిత్యాన్ని మళ్లీ చదవడం, కొత్త తరానికి పరిచయం చేయడం, కొత్త ప్రశ్నలతో పునఃపరిశీలించడం. మహబూబ్‌నగర్ వేదికగా జరుగుతున్న ఈ రాష్ట్రస్థాయి సదస్సు తెలంగాణ సాహిత్య విమర్శకు, పరిశోధనకు ఒక కొత్త దిశను చూపాలని ఆశిద్దాం. "కథాచరిత్ర" వంటి గ్రంథాలు కొత్త తరాలకు చేరాలి. సమర్పించిన పరిశోధనా పత్రాలు శాశ్వత గ్రంథాలుగా రూపుదిద్దుకోవాలి. యశోదారెడ్డి రచనలు మరిన్ని భాషల్లోకి వెళ్లాలి. ఆమె సాహిత్య సుగంధం తరతరాలకు పరిమళిస్తూ తెలంగాణ అక్షర సంస్కృతికి శాశ్వత స్ఫూర్తిగా నిలవాలి.




- డా. ఇడికోజు శ్రీనివాసాచారి
తెలుగు అధ్యాపకులు, కవి, విమర్శకులు





# కట్నపిశాచి

ఊరి చివరశ్మశానంలో కాదు,
ఇంటి నడిబొడ్డున...
పట్టుచీర కట్టుకొని, కుదురుగా కూర్చుంటుంది,
ఔరా! ఏమి అందమన్నట్టు నటిస్తుంటుంది.
దాని పేరే... కట్న పిశాచి!

అది అన్నం తినదు, బంగారం తింటుంది,
మంచినీళ్లు తాగదు, నోట్ల కట్టలను నోట్లో
కుక్కుకుంటుంది.
ఆడపిల్లల ఆశలను ఆరగిస్తుంది,
వారి ఉసురు తీసి తన పొట్ట నింపుకుంటుంది.

ఇంటికి దీపం పెట్టే ఆ లక్ష్మిని,
నిలువునా మింగేసే రాక్షసి ఇది.
పొలాలు అమ్మినా, పుత్తడి తాకట్టు పెట్టినా,
ఆకలి తీరక... ఇంకా కారు, బంగళా అంటుంది.

ఈ పిశాచిని వదిలి పెట్టకూడదు,
నిలువునా తగలబెట్టాలి!
చదువు అనే మంత్రంతో బంధించాలి,
ధైర్యం అనే కత్తితో తెగనరకాలి.

మహాకాళివై విజృంభించి,
పాతాళానికి తొక్కిపెట్టి అణచివేయాలి.
ఊరిలో నుండి కాదు నేస్తమా...
ముందు మన మనసుల్లో నుండి,
ఈ కట్నపిశాచిని తరిమివేయాలి!


సుభాషిణి. బి.
మంగళగిరి
9133444500




# బోనం ఎత్తిన తెలంగాణ

మహానగరంలో మహంకాళికి బోనాలు
భాగ్యనగరంలో బల్కంపేట బోనాలు
బోనమెత్తిన భాగ్యనగరం
ఆషాడంలో హైదరాబాదులో బోనాలు
డప్పులతోదరువు తో దండిగా పూజలు!!

సికింద్రాబాద్ లో శివసత్తులఆట పాటలు
పసుపు కుంకుమతో తల్లి కి పూజలు
గ్రామ గ్రామాన ఘనంగా బోనాలు
సాక పెట్టి సంతోషంగా ఉండాలని
కోరే భక్తులు
బైండ్ల ల్లో ఆటపాటలు!!

తల్లికి పల్లె పల్లెనా పట్నాలు
సబ్బండ వర్గాలు జరుపుకునే పండుగ
పోతరాజుల కొరడాలు
తీన్మార్ దరువుల గనాలు
మహంకాళి బోనాలు!!


దేవులపల్లి రమేశ్
9963701294